మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 11-10-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 102 Issue: 102

11 అక్టోబర్ 2025 - శనివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు ఆశ్వయుజ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:11 సూర్యాస్తమయం - సా. 5:53 తిథిః పంచమి సా. 4:48 వరకు తరువాత షష్ఠి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం రోహిణి మ. 3:22 వరకు తరువాత మృగశిర యోగం వ్యతీపాత మ. 2:05 వరకు కరణం తైతుల సా. 4:48 వరకు గరజి తె. 3:28 వరకు వర్జ్యం రా. 8:32 నుండి రా. 10:01 వరకు దుర్ముహూర్తం ఉ. 7:45 నుండి ఉ. 8:32 వరకు రాహుకాలం ఉ. 9:07 నుండి ఉ. 10:35 వరకు యమగండం మ. 1:30 నుండి మ. 2:58 వరకు గుళికాకాలం ఉ. 6:11 నుండి ఉ. 7:39 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:35 నుండి తె. 5:23 వరకు అమృత ఘడియలు మ. 12:24 నుండి మ. 1:51 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:39 నుండి మ. 12:26 వరకు

Published from Jagitial
www.evarthalu.com




## మరియాకు శాంతి

### వెనెజులా నేతకు నోబెల్ పీస్ మెడల్.. నియంతృత్వ పాలనపై అలుపెరుగని పోరాటం

ప్రపంచవ్యాప్తంగా శాంతి కోసం కృషి చేసే వారికి అందించే అత్యున్నత పురస్కారం, 2025 సంవత్సరానికి గాను ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతిని నార్వేజియన్ నోబెల్ కమిటీ శుక్రవారం ప్రకటించింది. వెనిజులాలో నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా, ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న ప్రతిపక్ష నేత మరియా కొరినా మచాడో ఈ అత్యున్నత గౌరవానికి ఎంపికయ్యారు. దేశంలో పెరిగిపోతున్న నియంతృత్వ చీకట్లలో ప్రజాస్వామ్య జ్యోతిని వెలిగిస్తూ, లక్షలాది మందికి ఆశాకిరణంగా నిలుస్తున్న ఆమె ధైర్యానికి, శాంతియుత పోరాటానికి ఈ బహుమతి ఒక గుర్తింపు అని నోబెల్ కమిటీ అభివర్ణించింది.

ఓస్లో: వెనిజులాలో నియంతృత్వం నుంచి ప్రజాస్వామ్యం వైపు శాంతియుత పరివర్తన కోసం, ప్రజల హక్కుల కోసం మరియా కొరినా మచాడో చేస్తున్న నిరంతర కృషిని కమిటీ ప్రత్యేకంగా ప్రశంసించింది. ఒకప్పుడు లాటిన్ అమెరికాలో సంపన్నమైన, ప్రజాస్వామ్య దేశంగా ఉన్న వెనిజులా, నేడు క్రూరమైన, అధికార దాహంతో నిండిన ప్రభుత్వ పాలనలో తీవ్రమైన మానవతా, ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది. దేశంలోని ఉన్నత -2 వ పేజీలో...




## ట్రంప్‌కు అ‘శాంతి’

### యుద్ధాలు ఆపానన్నా దక్కని గుర్తింపు.. చిత్తశుద్ధే ముఖ్యమన్న నోబెల్ కమిటీ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎంతోకాలంగా ఆశిస్తున్న నోబెల్ శాంతి బహుమతి ఈసారి కూడా ఆయనకు అందని ద్రాక్షగానే మిగిలింది. భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానంటూ చేసిన ప్రచారంతో సహా, అనేక వివాదాస్పద వాదనలతో ఈ పురస్కారం కోసం తీవ్రంగా ప్రయత్నించిన ట్రంప్‌కు నిరాశే ఎదురైంది. 2025 సంవత్సరానికి గాను ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతిని వెనిజులాకు చెందిన విపక్ష నేత, ప్రజాస్వామ్య ఉద్యమకారిణి మరియా కొరినా మచాడోకు అందిస్తున్నట్లు నోబెల్ కమిటీ ప్రకటించింది.

ఓస్లో/న్యూయార్క్: నోబెల్ బహుమతి ప్రకటన అనంతరం కమిటీ ఛైర్మన్ జార్గెన్ వాట్నే ఫ్రైడ్నెస్ మాట్లాడుతూ, తమ నిర్ణయం కేవలం గ్రహీతల ధైర్యసాహసాలు, చిత్తశుద్ధిపైనే ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు. ‘ఏటా మాకు వేలాది సిఫార్సు లేఖలు వస్తాయి, మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారాలు జరుగుతాయి. కానీ మా నిర్ణయాలు ఆల్ఫ్రెడ్ నోబెల్ సంకల్పానికి అనుగుణంగానే ఉంటాయి’ అని తెలిపారు. ఈ వ్యాఖ్యలు పరోక్షంగా ట్రంప్ ప్రచార సరళిని ఉద్దేశించినవేనని తరువాయి 2 వ పేజీలో...



చంటి బిడ్డ మెడలో బంగారు గొలుసు.. చేతి వేళ్లకు బంగారు ఉంగరాలు.. పండు ముసలవ్వ చెవులకు బంగారు దుద్దులు.. చేతికి బంగారు కంకణాలు.. ఇల్లాలి మెడలో బంగారు పుస్తెలతాడు.. చేతివేలికి బంగారు ప్రధానపు ఉంగరం.. ఇలా ప్రతి (దాదాపు) భారతీయ మహిళ ఎంతో కొంత బంగారాన్ని ధరిస్తూనే ఉంటుంది. పేద కుటుంబంలోని మహిళ కూడా ఎంతో కొంత బంగారాన్ని కలిగి ఉంటుంది. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా భారతదేశంలో బంగారానికి ఎంత డిమాండ్ ఉందో చెప్పడానికి ఇంత కన్నా ఉదాహరణలు వేరే అక్కరలేదు. సగటుగా భారతీయుల వద్ద ఉన్న బంగారం విలువ ఎంతో తెలుసా.. ఏకంగా రూ.33,71,32,39,00,00,000. అంటే.. రూ.3 కోట్ల కోట్లు.

## ఇల్లిల్లూ.. బంగారం



### భారత కుటుంబాల వద్ద బంగారం.. రూ.3 కోట్ల కోట్లు

**దేశ జీడీపీలో ఇది 88.8 శాతంతో సమానం**

**ఆర్బీఐ వద్ద 880 టన్నులకు పసిడి నిల్వలు**

**ఈటీఎఫ్‌ల రూపంలో పెరుగుతున్న పెట్టుబడులు**

**ప్రముఖ సంస్థ మోర్గాన్ స్టాన్లీ ఆసక్తికర నివేదిక**

2 — ప్రపంచంలో బంగారం వినియోగంలో భారత్ నం.

న్యూఢిల్లీ: భారతీయ కుటుంబాల వద్ద ఉన్న బంగారం ఎంతో ఇప్పటికీ స్పష్టమైన లెక్కలేదు. ప్రతి ఇల్లాలి వద్దో, ప్రతి ఇంట్లో ఎంతో కొంత బంగారం ఉంటుంది అన్న అంచనా తప్పితే లెక్కలైతే లేవు. ఆ లెక్కెంతో, దాని విలువెంతో, ఆ బంగారంతో భారతీయ ఆర్థిక శక్తి ఎంతో.. నివేదిక రూపంలో వెల్లడించింది ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ మోర్గాన్ స్టాన్లీ. దేశంలోని ఇళ్లలో ఉన్న పసిడి నిల్వల విలువ ఏకంగా 3.8 ట్రిలియన్ తరువాయి 2 వ పేజీలో...

## పటాకులు కాల్చుకుంటాం పండుగ చేసుకుంటాం

**దీపావళికి అనుమతివ్వండి**

**సుప్రీంకు ఎన్సీఆర్ రిక్వెస్ట్**



కాలుష్య రహిత బాణసంచాతో పిల్లలు దీపావళి పండుగ జరుపుకోవడానికి అనుమతించాలని పలు రాష్ట్రాలు సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. పిల్లలు దీపావళి రోజున బాణసంచా కాల్చడానికి ఎదురు చూస్తుంటారని తెలిపాయి. అయితే పర్యావరణహితమైన బాణసంచాతో వారిని పండుగ చేసుకోనివ్వాలని రాష్ట్రాలు కోరాయి.

న్యూఢిల్లీ/ఎన్సీఆర్: ఈ మేరకు ఎన్సీఆర్ (నేషనల్ క్యాపిటల్ రీజియన్ రాష్ట్రాలు – ఢిల్లీతో పాటు హర్యానా, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లోని రాజధాని ప్రాంత జిల్లాలు) రాష్ట్రాల తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, న్యాయమూర్తి జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో తరువాయి 2 వ పేజీలో...



## రాజన్న లడ్డూకు బూజు!

**అధికారుల నిర్లక్ష్యంపై భక్తుల ఆగ్రహం**

**అవి బయటి లడ్డూలన్న ఆలయ ఈవో**

**విచారణకు కొండా సురేఖ ఆదేశం**



వేములవాడ రాజన్న లడ్డూకు తెలంగాణలో ప్రత్యేక స్థానం ఉంది. ఓ చిన్న లడ్డూ ముక్క నోట్లో వేసుకున్నా అదో తృప్తి. అయితే, లడ్డూ తయారీలో నాణ్యత కోల్పోయినట్లు ఆరోపణలు వస్తున్నాయి. తయారీ కేంద్రాల్లో శుచి, శుభ్రత పాటించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


వేములవాడ, అక్టోబర్ 10 (ఈవార్తలు): తాజాగా శుక్రవారం చోటు చేసుకున్న ఓ సంఘటనే అందుకు నిదర్శనం. రాజన్న గుడిలో నాణ్యత లేని లడ్డూలు విక్రయిస్తున్నారంటూ శుక్రవారం భక్తులు ఆందోళన వ్యక్తం చేశారు. లడ్డూలకు బూజు పట్టాయని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లడ్డూలు ఉంచిన ట్రేల నుంచి దుర్వాసన వస్తున్నట్లు తరువాయి 2 వ పేజీలో...



### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,371 |
| వెండి (గ్రాము): | రూ.1౦84 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,546 |

### విశ్వవాణి



సంతోషంగా లేరా.. అయితే ఆఫీస్‌కు రానక్కరలేదని ఉద్యోగులకు ఆఫర్ ఇస్తోంది ఓ చైనా కంపెనీ. ఇందుకోసం కొత్తగా ‘అన్ హ్యాపీ లీవ్స్’ను అందుబాటులోకి తీసుకొచ్చింది. మానసికంగా బాధలో ఉన్నప్పుడు ఉద్యోగుల ఉత్పాదకత తగ్గుతుందని, రీఫ్రెష్ అయ్యి ఆఫీస్‌కు వస్తే రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తారని, తద్వారా ఉత్పాదకత మరింత పెరుగుతుందని ప్యాంగ్ డాంగ్ లై అనే చైనీస్ కంపెనీ ఈ ఆలోచనకు శ్రీకారం చుట్టింది.బొప్పాయి చెట్లను నాటిన 6-12 నెలల్లోనే పండ్లు కాస్తాయి. ఉష్ణ మండల ప్రాంతాల్లో అత్యంత వేగంగా పెరిగే పండ్లు ఇవే.

## హైడ్రా.. అదరహో

**చెర వీడిన రూ.750 కోట్ల ప్రభుత్వ భూమి**

**5 ఎకరాల స్థలాన్ని కబ్జా చేసిన పార్థసారథి అనే వ్యక్తి**

**స్థలాన్ని స్వాధీనం చేసుకుని ఫెన్సింగ్ వేసిన హైడ్రా**



బంజారాహిల్స్/హైదరాబాద్, అక్టోబర్ 10 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలోని అత్యంత ఖరీదైన ప్రాంతాల్లో ఒకటైన బంజారాహిల్స్‌లో హైడ్రా తన పంజా విసిరింది. సుమారు రూ.750 కోట్ల విలువైన 5 ఎకరాల ప్రభుత్వ భూమిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నకిలీ పత్రాలతో స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే, బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10లో సర్వే నంబర్ 403లో ఐదెకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో 1.20 ఎకరాల స్థలాన్ని జలమండలికి వాటర్ రిజర్వాయర్ నిర్మాణం కోసం ప్రభుత్వం గతంలో కేటాయించింది. అయితే, పార్థసారథి అనే వ్యక్తి ఈ మొత్తం ఐదెకరాల భూమి తనదేనంటూ తరువాయి 2 వ పేజీలో...




## ఫిన్‌టెక్.. భారత్ నం.3

**ప్రపంచంలోనే 3వ అతిపెద్ద ఫిన్ టెక్ వ్యవస్థ**

**ఈ ఏడాది 9 నెలల్లో 13 వేల కోట్ల పెట్టుబడులు**

**ఫిన్‌టెక్ పెట్టుబడులకు కేంద్రంగా బెంగళూరు**

ముంబై/బెంగళూరు: ప్రపంచ వేదికపై భారత ఫిన్‌టెక్ రంగం తన బలాన్ని చాటుకుంటోంది. స్టార్టప్‌లకు నిధుల సమీకరణలో అమెరికా, యూకే తర్వాత ప్రపంచంలోనే మూడో అతిపెద్ద దేశంగా భారత్ అవతరించింది. 2025 మొదటి తొమ్మిది నెలల్లో మన దేశంలోని ఫిన్‌టెక్ స్టార్టప్‌లు ఏకంగా 1.6 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 13,300 కోట్లు) నిధులను సమీకరించాయి. ఈ విషయాన్ని ప్రముఖ ప్రైవేట్ మార్కెట్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ తరువాయి 2 వ పేజీలో...

## కాంగ్రెస్ పరువు పాయే

### ఇప్పటికైనా తప్పు తెలుసుకోవాలి.. వెంటనే ఎన్నికలు జరిపించాలి.. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్



మేడ్చల్/హైదరాబాద్, అక్టోబర్ 10 (ఈవార్తలు): రాష్ట్రంలోని బీసీలకు రిజర్వేషన్లు రావడం బీజేపీ ఆకాంక్ష అని, పార్టీ ఎల్లప్పుడూ బీసీల వెంటే ఉంటుందని ఆ పార్టీ నేత, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం ఎక్కడకి రమ్మన్నా సిద్ధంగా ఉన్నామని ఆయన అన్నారు. తమిళనాడులో ఈ రిజర్వేషన్లు విజయవంతమయ్యాయని, అక్కడ అధ్యయనం చేయాలని గతంలో తాను చాలాసార్లు సూచించానని గుర్తు చేశారు. దేశంలో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కలిగినవి షెడ్యూల్డ్ ట్రైబల్, షెడ్యూల్ క్యాస్ట్ అని, వారి జనాభా ఎంత ఉంటే అంత శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందేనని అన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో 90 శాతం మంది ఉంటే 90 శాతం రిజర్వేషన్లు ఉన్నాయని, అది రాజ్యాంగం కల్పించిన హక్కు అని పేర్కొన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ తప్పు తెలుసుకొని క్షమాపణ



## తొక్కితే.. ఎక్కుతా

**కాంగ్రెస్ నాయకత్వంపై అంజన్ కుమార్ ఫైర్**

**సీఎం రేవంత్‌ను ఉద్దేశించి పరోక్ష విమర్శలు**

**జూబ్లీహిల్స్ టికెట్‌పై ముదిరిన వివాదం**

**తీవ్ర అసంతృప్తితో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్**

**కార్యకర్తలతో చర్చించాకే నిర్ణయమని వెల్లడి**

**బుజ్జగించేందుకు రంగంలోకి దిగిన మంత్రులు**

హైదరాబాద్, అక్టోబర్ 10 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక కాంగ్రెస్ పార్టీలో తీవ్ర కలకలం రేపింది. టికెట్ కేటాయింపు వ్యవహారంపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ తీవ్ర అసంతృప్తితో భగ్గుమన్నారు. 40 ఏళ్లుగా పార్టీకి సేవ చేస్తున్న తనను కనీసం సంప్రదించకుండా అభ్యర్థిని ఎలా ఖరారు చేస్తారని నిలదీశారు. ఇది తనను ఘోరంగా అవమానించడమేనని మండిపడ్డారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు మాత్రమే తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

11.10.2025

మేషం: ఆరోగ్య విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. వ్యాపార విషయంలో కుటుంబ పెద్దల సలహాలు తీసుకుని ముందుకు సాగడం మంచిది. ఉద్యోగస్తులకు పనిభారం పెరుగుతుంది. నిరుద్యోగ ప్రయత్నాలు మందకోడిగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి మందగిస్తుంది. ఇంటాబయట మానసిక సమస్యలు చికాకు పరుస్తాయి.

వృషభం: నిరుద్యోగ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. ఉద్యోగమున పదోన్నతులు పెరుగుతాయి. పాతరుణాలు తీర్చగలరు. వ్యాపార విస్తరణకు పెట్టుబడులు అందుతాయి. దూరపు బంధువుల నుంచి శుభవార్తలు అందుతాయి. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

మిథునం: వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. మిత్రులతో చిన్నపాటి మాటపట్టింపులు కలుగుతాయి. అనుకున్న పనులు ముందుకు సాగక నిరాశ పెరుగుతుంది. ఉద్యోగాలలో శ్రమకు తగిన గుర్తింపు లభించదు. ఇంటాబయట నూతన సమస్యలు తప్పవు. మానసిక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి.

కర్కాటకం: వృత్తి వ్యాపారాల్లో ఆశించిన పురోగతి లభిస్తుంది. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి ఉద్యోగాల్లో మీ హెూదా పెరుగుతుంది. విద్యార్థుల నూతన విద్యావకాశములు లభిస్తాయి. సన్నిహితుల నుండి ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి.

సింహం: ఉద్యోగస్తులకు పనిఒత్తిడి నుండి ఉపశమనం కలుగుతుంది. బంధు మిత్రుల సహాయ సహకారాలతో కొన్ని వ్యవహారాలు పూర్తి చేస్తారు. ఆర్థిక వాతావరణం ఆశించిన విధంగా ఉంటుంది. చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. కుటుంబ సభ్యులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

కన్య: వ్యాపారాలు మందకోడిగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలలో అవరోధాలు తప్పవు. ఆరోగ్య విషయంలో కొంత జాగ్రత్త వహించాలి. ఉద్యోగ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. ఆదాయానికి మించిన ఖర్చులు పెరుగుతాయి. బంధు మిత్రులతో ఊహించని కలహాలు కలుగుతాయి.

తుల: నిరుద్యోగులకు ప్రయత్నాలు ఫలించవు. ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ముఖ్యమైన వ్యవహారాలలో ఆలోచనలలో నిలకడ లోపిస్తుంది. వృత్తి వ్యాపారాలలో అకారణ వివాదాలు కలుగుతాయి.

వృశ్చికం: సమాజంలో మీమాటకు విలువ పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో పుణ్యక్షేత్ర దర్శనం చేసుకుంటారు. నిరుద్యోగ ప్రయత్నాలు అనుకూలంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలు సకాలంలో పూర్తి చేస్తారు. వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు.

ధనస్సు: వృత్తి వ్యాపారాల్లో ఆశించిన లాభాలు అందుకుంటారు. నిరుద్యోగులకు అధికారులు అనుగ్రహంతో ఉద్యోగావకాశాలు లభిస్తాయి. గృహ నిర్మాణ ఆలోచనలో ఆచరణలో పెడతారు. శుభకార్యాలకు హాజరవుతారు. ఇంటా బయట మానసిక ప్రశాంతత కలుగుతుంది. చేపట్టిన వ్యవహారాలు విజయవంతంగా పూర్తి చేస్తారు.

మకరం: వ్యాపార ఉద్యోగాలు కొంత నిదానంగా సాగుతాయి. బంధు వర్గంతో విభేదాలు కలుగుతాయి. అనుకున్న సమయానికి డబ్బు చేతికి అందక ఇబ్బంది పడతారు. దైవ చింతన పెరుగుతుంది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొంటారు. దూర ప్రయాణాలలో జాగ్రత్తగా వ్యవహరించాలి.

కుంభం: వ్యాపారాలలో తీసుకున్న నిర్ణయాలు కలిసిరావు. వృత్తి ఉద్యోగాలు మందకొడిగా సాగుతాయి. చేపట్టిన పనుల్లో ఆటంకాలు తప్పవు. మిత్రులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. నూతన ఋణ ప్రయత్నాలు కలసిరావు. ఖర్చుల విషయంలో ఆలోచించి వ్యవహరించడం మంచిది. ఆకస్మిక ప్రయాణాలు చేస్తారు.

మీనం: వృత్తి వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. సమాజంలో పేరు కలిగిన వ్యక్తుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. ఉద్యోగమున నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు. చేపట్టిన పనులు వేగవంతంగా పూర్తి చేస్తారు. పాతమిత్రులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు.

# రాజన్న లడ్డూకు బూజు!

మొదటి పేజీ తరువాయి

భక్తులు తెలిపారు. ఎంతో పవిత్రంగా భావించే లడ్డూ ప్రసాదాన్ని ఇలా విక్రయించడమేంటని భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న బీజేపీ, విశ్వహిందూ పరిషత్తు నేతలు లడ్డూ ప్రసాదాలను పరిశీలించారు. భక్తుల మనోభావాలు కాపాడాలని ఈవోను కోరారు. వీహెచ్‌పీ రాజన్న సిరిసిల్ల జిల్లా సహాయ కార్యదర్శి గడప కిషోర్ రావు మాట్లాడుతూ.. 'లడ్డు తయారీని పూర్తిగా వ్యాపారంగా మార్చేశారు. తయారీలో శుచి, శుభ్రత పాటించడం లేదు. భక్తుల మనోభావాలు పట్టించుకోకుండా ఆలయ అధికారులు ప్రసాదాల తయారీని చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రసాదాల నాణ్యతపై భక్తులతో కలిసి ఉద్యమిస్తాం' అని పేర్కొన్నారు.

## విచారణకు మంత్రి సురేఖ ఆదేశం

వేములవాడలో లడ్డూలకు బూజు పట్టిన ఘటనపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పందించారు. సంబంధిత అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనపై సమగ్ర నివేదిక అందజేయాలని ఆదేశించారు. దేవాలయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని మంత్రి సూచించారు. ఆలయ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అవి బయటి లడ్డూలే: ఈవో

రాజన్న లడ్డూకు బూజు పట్టిన ఘటనపై ఆలయ ఈవో రమాదేవి ద్వంద్వ సమాధానాలు ఇచ్చారు. గత రెండు రోజులుగా వర్షం కారణంగా తేమ రావడంతో అలా జరిగిందని చెప్తూనే.. ఆ లడ్డూలు ప్రసాద కేంద్రంలోనివి కావని బయటి లడ్డూలు అని చెప్పడం అనుమానాలకు తావిస్తోంది. ఘటనను ఫుడ్ సేఫ్టీ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఆమె చెప్పడం మరింత అనుమానాలను రేకెత్తించింది. బయటి లడ్డూలే అని చెప్పి, ఫుడ్ సేఫ్టీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ఎందుకు? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. లడ్డూ ప్రసాదంపై భక్తుల నుంచి విమర్శలు రావడంతో ఆలయ పవిత్రతను కాపాడుతామని, భక్తుల మనోభావాలను గౌరవిస్తామని, అందుకు తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# ఫిన్‌టెక్.. భారత్ నం.3

మొదటి పేజీ తరువాయి

'ట్రాక్సన్' శుక్రవారం విడుదల చేసిన ఒక నివేదికలో వెల్లడించింది. నివేదిక ప్రకారం, ఈ ఏడాది తొలి దశ (ఎర్లీ-స్టేజ్) స్టార్టప్‌లకు నిధులు పెరగడం విశేషం. 2024లో ఇదే సమయానికి 555 మిలియన్ డాలర్లుగా ఉన్న పెట్టుబడులు, ఈ ఏడాది 598 మిలియన్ డాలర్లకు పెరిగాయి. ఇది వర్ధమాన కంపెనీలపై పెట్టుబడిదారులకు ఉన్న విశ్వాసాన్ని సూచిస్తోంది. అయితే, చివరి దశ స్టార్టప్‌ల నిధులు మాత్రం 1.2 బిలియన్ డాలర్ల నుంచి 863 మిలియన్ డాలర్లకు తగ్గాయి. సీడ్-స్టేజ్ ఫండింగ్ కూడా 129 మిలియన్ డాలర్లకు తగ్గింది. ఈ కాలంలో రెండు అతిపెద్ద ఫండింగ్ రౌండ్లు జరిగాయి. గ్రో సంస్థ సిరీస్ ఎఫ్ రౌండ్‌లో 202 మిలియన్ డాలర్లు, వీవర్ సర్వీసెస్ 170 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించాయి. ఇదే సమయంలో మొత్తం 23 కంపెనీల టేకోవర్లు జరిగాయి. వీటిలో రిజల్టిక్స్‌ను డిజినెక్స్ సంస్థ 2 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేయడం అతిపెద్ద ఒప్పందంగా నిలిచింది. అంతేకాకుండా, శేషసాయి అనే సంస్థ ఐపీవోకి రాగా, కొత్తగా రెండు యూనికార్న్‌లు కూడా ఆవిర్భవించాయి. దేశంలో ఫిన్‌టెక్ పెట్టుబడులకు కర్ణాటక రాజధాని బెంగళూరు ప్రధాన కేంద్రంగా కొనసాగుతోంది. మొత్తం నిధులలో 52 శాతం వాటాతో బెంగళూరు అగ్రస్థానంలో ఉండగా, 22 శాతం వాటాతో ముంబై రెండో స్థానంలో నిలిచింది. ఈ నివేదికపై ట్రాక్సన్ సహ వ్యవస్థాపకురాలు నేహా సింగ్ మాట్లాడుతూ.. 'నిధుల సమీకరణలో కొంత మందగమనం ఉన్నప్పటికీ భారత ఫిన్‌టెక్ రంగం ఎంతో పటిష్టంగా ఉంది. తొలి దశ స్టార్టప్‌లపై పెట్టుబడిదారుల విశ్వాసం తగ్గలేదనడానికి కొత్త యూనికార్న్‌ల ఆవిర్భావమే నిదర్శనం' అని తెలిపారు. 'బెంగళూరు, ముంబై వంటి నగరాలు ఆవిష్కరణలకు కేంద్రంగా ఉండటం భారత స్టార్టప్ వ్యవస్థ పరిణతికి సంకేతం. భవిష్యత్తులో ఈ రంగంలో సాంకేతిక ఆవిష్కరణలు మరింత పెరిగి, దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడులు పెరుగుతాయని ఆశిస్తున్నాం' అని పేర్కొన్నారు.

# హైడ్రా.. అదరహో

మొదటి పేజీ తరువాయి

అన్ రిజిస్టర్డ్ సేల్ డీడ్ పత్రాలతో కోర్టును ఆశ్రయించాడు. వాస్తవానికి ఈ భూమి సర్వే నంబర్ 403 కాగా, అతను 403/52 అనే నకిలీ సర్వే నంబర్‌ను సృష్టించి మోసానికి పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. కోర్టులో కేసు విచారణలో ఉండగానే, పార్థసారథి ఆ స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, బౌన్సర్లు, వేటకుక్కలను కాపలాగా ఉంచాడు. లోపల తాత్కాలిక షెడ్లు నిర్మించి, భూమిని పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకున్నాడు. వాటర్ రిజర్వాయర్ నిర్మాణానికి వెళ్లిన జలమండలి సిబ్బందిని అడ్డుకోవడంతో పాటు, స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని జలమండలి, రెవెన్యూ అధికారులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో భారీ పోలీసు బందోబస్తు నడుమ ఆక్రమణల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. హైడ్రా సిబ్బంది ప్రత్యేక యంత్రాలతో కబ్జాదారు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్, షెడ్లను పూర్తిగా కూల్చివేశారు. అనంతరం 5 ఎకరాల భూమి చుట్టూ కొత్తగా ఫెన్సింగ్ వేసి, ఇది ప్రభుత్వ భూమి అని స్పష్టం చేస్తూ బోర్డులు ఏర్పాటు చేశారు. భూకబ్జాకు పాల్పడిన పార్థసారథిపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఇప్పటికే నాలుగు క్రిమినల్ కేసులు నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు.

# ఇల్లిల్లూ బంగారం

మొదటి పేజీ తరువాయి

డాలర్లని, ఇది దేశ స్థూల జాతీయోత్పత్తిలో (జీడీపీ) 88.8 శాతానికి సమానమని ఈ నివేదిక అంచనా వేసింది. ప్రస్తుతం బంగారం ధరలు ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయికి చేరడంతో, కుటుంబాల సంపదపై ఇది సానుకూల ప్రభావం చూపుతోందని శుక్రవారం విడుదల చేసిన ఈ నివేదికలో పేర్కొంది. ప్రస్తుతం బంగారం ధరలు రికార్డు స్థాయిలో కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 4,056 డాలర్ల వద్ద ఉండగా, దేశీయంగా 10 గ్రాముల పసిడి ధర సుమారు రూ. 1,27,300 పలుకుతోంది. ఈ ఏడాది ఇప్పటివరకు డాలర్లలో బంగారం ధర 54.6 శాతం పెరగ్గా, రూపాయిలలో 61.8 శాతం పెరిగినట్లు నివేదిక వివరించింది. ప్రపంచంలో బంగారం వినియోగంలో చైనా (28%) మొదటి స్థానంలో ఉండగా, భారత్ (26%) రెండో స్థానంలో కొనసాగుతోంది. దేశంలో బంగారం డిమాండ్‌లో ఎక్కువ భాగం గృహ వినియోగం నుంచే వస్తోంది. అయితే, ఇటీవలి కాలంలో పెట్టుబడి మార్గాలు కూడా మారుతున్నాయి. భౌతిక బంగారం కాకుండా, ఈటీఎఫ్‌ల వంటి ఆర్థిక ఆస్తుల వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారని, గత 12 నెలల్లో ఈటీఎఫ్‌లలోకి 1.8 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయని నివేదిక తెలిపింది. మరోవైపు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కూడా తన పసిడి నిల్వలను పెంచుకుంటోంది. 2024 నుంచి ఆర్బీఐ సుమారు 75 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. దీంతో ఆర్బీఐ వద్ద ఉన్న మొత్తం బంగారం నిల్వలు 880 టన్నులకు చేరాయి. ఇది దేశ మొత్తం విదేశీ మారక నిల్వల్లో 14 శాతానికి సమానం. ఇక, దేశంలో స్థూల ఆర్థిక స్థిరత్వం కారణంగా బంగారం దిగుమతులు అదుపులోనే ఉన్నాయని మోర్గాన్ స్టాన్లీ విశ్లేషించింది. ద్రవ్యోల్బణం సగటున 5 శాతంగా ఉండటం, సానుకూల వడ్డీ రేట్లు కొనసాగడం వల్ల ప్రజలు భౌతిక ఆస్తులపై అధికంగా ఆధారపడటం లేదని పేర్కొంది. ప్రస్తుతం బంగారం దిగుమతులు జీడీపీలో 1-1.5 శాతం మధ్య ఉండగా, 2013 మే నెలలో ఇది రికార్డు స్థాయిలో 3.3 శాతంగా ఉండేది. ఈ స్థిరత్వం కరెంట్ ఖాతా లోటుపై ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడిందని నివేదిక పేర్కొంది.

# తొక్కితే.. ఎక్కుతా

మొదటి పేజీ తరువాయి

స్థానిక, స్థానికేతర అంశం ఎందుకు తెరపైకి వచ్చిందని ప్రశ్నించారు. గతంలో కామారెడ్డి, మల్కాజ్‌గిరిలో పోటీ చేసినప్పుడు ఈ విషయం గుర్తుకు రాలేదా? అంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి పరోక్షంగా చురకలు అంటించారు. కష్టకాలంలో కూడా పార్టీని అంటిపెట్టుకుని పనిచేశానని, అయినా తనకు తగిన గౌరవం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 'వాళ్లు మమ్మల్ని తొక్కుకుంటూ పోతే, మేం ఎక్కుకుంటూ పోతాం' అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తనకు టికెట్ రాకుండా అడ్డుపడింది ఎవరో త్వరలోనే బయటపెడతానని అన్నారు. కనీసం నియోజకవర్గ కమిటీలో కూడా తనకు స్థానం కల్పించలేదని వాపోయారు. తన మద్దతుదారులు, కార్యకర్తలతో సమావేశమైన తర్వాత తన భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తానని ఆయన స్పష్టం చేశారు. అయితే, అంజన్ కుమార్ యాదవ్‌ను బుజ్జగించేందుకు మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్‌తో పాటు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ స్వయంగా ఆయన నివాసానికి వెళ్లి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన వారి ఎదుట ఆవేదనను, ఆగ్రహాన్ని వెళ్లగక్కారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన తనను ఇప్పుడు పక్కన పెట్టడం బాధాకరమన్నారు. తాను పార్టీలో చాలా సీనియర్ నాయకుడినని, ఎప్పుడూ ఓడిపోలేదని, కానీ అందరూ కలిసి ఓడగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తనకు టిక్కెట్ ఇస్తే గెలిచేవాడినని ధీమా వ్యక్తం చేశారు. కరోనా సమయంలో సేవా కార్యక్రమాలు నిర్వహించానని, ఆ తర్వాత కరోనాతో వెంటిలెటర్‌పై చికిత్స చేయించుకున్నానని గుర్తు చేశారు. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేశానని అంజన్ కుమార్ అన్నారు. కాంగ్రెస్ పార్టీలో అనేక పదవులు చేపట్టానని, రెండుసార్లు హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశానని గుర్తు చేశారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్‌లో అంజన్ కుమార్ పోటీ చేయాలని చాలామంది భావించారని అన్నారు. కానీ, అధిష్ఠానం మరొకరికి టిక్కెట్ కేటాయించిందని చెప్పారు. నగరంలో కాంగ్రెస్ పార్టీకి అంజన్ కుమార్ పెద్ద దిక్కుగా ఉన్నారని కొనియాడారు. అంజన్ నాయకత్వంలోనే పార్టీ ముందుకు వెళుతుందని, జూబ్లీహిల్స్‌లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# మరియాకు శాంతి

మొదటి పేజీ తరువాయి

వర్గాలు సంపదను పోగేసుకుంటుంటే, మెజారిటీ ప్రజలు తీవ్ర పేదరికంలో మగ్గుతున్నారు. ప్రభుత్వ హింసా యంత్రాంగం సొంత పౌరుల పైనే ప్రయోగిస్తుండటంతో, ఇప్పటివరకు దాదాపు 80 లక్షల మంది దేశం విడిచి పారిపోయారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో, విడిపోయిన ప్రతిపక్షాలను ఏకతాటిపైకి తీసుకురావడంలో మచాడో కీలక పాత్ర పోషించారు. స్వేచ్ఛాయుత ఎన్నికలు, ప్రాతినిధ్య ప్రభుత్వం అనే ఉమ్మడి లక్ష్యం కోసం ఆమె అందరినీ ఏకం చేశారని కమిటీ కొనియాడింది. గత 20 ఏళ్లుగా మచాడో ప్రజాస్వామ్య ఉద్యమంలో చురుగ్గా ఉన్నారు. స్వేచ్ఛాయుత ఎన్నికల కోసం ఆమె స్థాపించిన 'సుమేట్' అనే సంస్థ ద్వారా "తుపాకీ తూటాల కన్నా బ్యాలెట్ ఓట్లే ముఖ్యం" అనే నినాదంతో ఆమె ప్రజలను చైతన్యపరిచారు. న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యం, మానవ హక్కులు, ప్రజా ప్రాతినిధ్యం కోసం ఆమె గొంతుకను బలంగా వినిపించారు. 2024 అధ్యక్ష ఎన్నికల్లో ఆమె అభ్యర్థిత్వాన్ని అధికార ప్రభుత్వం అడ్డుకున్నప్పటికీ ఆమె వెనక్కి తగ్గలేదు. ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా ఎడ్మండో గొంజాలెజ్ ఉరుటియాకు మద్దతు ప్రకటించి, ఆయన గెలుపు కోసం పనిచేశారు. ఆ ఎన్నికల్లో ప్రభుత్వ రిగ్గింగ్‌ను అడ్డుకునేందుకు ఆమె నాయకత్వంలో లక్షలాది మంది వాలంటీర్లు పోలింగ్ కేంద్రాల వద్ద కాపలా కాశారు. వేధింపులు, అరెస్టులు, చిత్రహింసలు తప్పవని తెలిసినా వారు ధైర్యంగా నిలబడ్డారు. ప్రతిపక్షాలు స్పష్టమైన మెజారిటీతో గెలిచాయని ఆధారాలతో సహా నిరూపించినా, అధికార ప్రభుత్వం ఫలితాలను అంగీకరించకుండా అధికారాన్ని అంటిపెట్టుకుని కూర్చుంది. ప్రాణాలకు తీవ్రమైన ముప్పు ఉన్నప్పటికీ, దేశం విడిచి వెళ్లకుండా రహస్యంగా ఉంటూనే తన పోరాటాన్ని కొనసాగిస్తున్నారని నోబెల్ కమిటీ పేర్కొంది. అధికార శక్తులు విజృంభిస్తున్న తరుణంలో, మరియా కొరినా మచాడో వంటి స్వేచ్ఛా సంరక్షకులను గుర్తించడం చాలా కీలకమని కమిటీ అభిప్రాయపడింది. ఆమె శాంతి, ప్రజాస్వామ్యం అనే రెండూ ఒకదానికొకటి ముడిపడి ఉన్నాయని నిరూపించారని, పౌరుల హక్కులకు రక్షణ లభించే భవిష్యత్తుకు ఆమె ఒక ఆశాదీపం అని నోబెల్ కమిటీ తన ప్రకటనలో ముగించింది.

# ట్రంప్‌కు అ'శాంతి'

మొదటి పేజీ తరువాయి

విశ్లేషకులు భావిస్తున్నారు. నోబెల్ పురస్కారం కోసం ట్రంప్, వైట్‌హౌస్ పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాయి. గత నెల ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో కూడా ట్రంప్ తన శాంతి యత్నాల గురించి గొప్పగా చెప్పుకున్నారు. భారత్-పాకిస్థాన్ మధ్య మే నెలలో ఉద్రిక్తతలను తానే చల్లార్చానని ఆయన బలంగా వాదించారు. అయితే, పాకిస్థాన్ ప్రత్యక్ష అభ్యర్థన మేరకే కాల్పుల విరమణ జరిగిందని, ఇందులో ట్రంప్ పాత్ర ఏమీ లేదని భారత్ అప్పట్లోనే తీవ్రంగా ఖండించింది. దీనితో పాటు ఇజ్రాయెల్-ఇరాన్, రువాండా-కాంగో, సెర్బియా-కొసోవో సహా మొత్తం ఏడు యుద్ధాలను తానే పరిష్కరించినట్లు ట్రంప్ చెప్పుకున్నారు. వాస్తవానికి వీటిలో కొన్ని పూర్తిస్థాయి యుద్ధాలు కాకపోగా, మరికొన్నింటిలో ఉద్రిక్తతలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## తీవ్రంగా స్పందించిన వైట్ హౌస్

ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి రాకపోవడంపై అమెరికా అధ్యక్ష భవనం వైట్ హౌస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ఎంపిక ప్రపంచ శాంతి పట్ల నిబద్ధతను కాకుండా, రాజకీయ పక్షపాతాన్ని ప్రతిబింబిస్తోందని ఘాటుగా విమర్శించింది. ఈ విషయంపై వైట్ హౌస్ ప్రతినిధి ఒకరు రాయిటర్స్ వార్తా సంస్థతో మాట్లాడుతూ, 'శాంతి కంటే రాజకీయాలకే నోబెల్ కమిటీ పెద్దపీట వేస్తుందని మరోసారి రుజువైంది' అని వ్యాఖ్యానించారు.

ట్రంప్‌కు రష్యా మద్దతు

నోబెల్ శాంతి బహుమతి ప్రకటనకు ముందు డొనాల్డ్ ట్రంప్ అభ్యర్థిత్వాన్ని రష్యా సమర్థిస్తుందని క్రెమ్లిన్ ప్రకటించింది. ఈ మేరకు క్రెమ్లిన్ అధికారి యురి ఉషకోవ్ ప్రకటన చేశారని ప్రముఖ న్యూస్ ఏజెన్సీ టాస్ పేర్కొంది. శాంతి బహుమతి ప్రకటనకు కొన్ని గంటల ముందు రష్యా ఈ కీలక ప్రకటన చేసింది.

# పటాకులు కాల్చుకుంటాం


మొదటి పేజీ తరువాయి

కూడిన ధర్మాసనాన్ని కోరారు. ఢిల్లీ-ఎన్సీఆర్ పరిధిలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయిలో ఉన్నందున బాణసంచా విక్రయాలను నిషేధిస్తూ సుప్రీంకోర్టు ధర్మాసనం ఏప్రిల్ 3న తీర్పు వెలువరించింది. అయితే దీపావళి రోజున రాత్రి 8 నుంచి 10 గంటల వరకు పర్యావరణ హిత బాణసంచా కాల్చడానికి అనుమతివ్వాలని కోరారు. కొన్ని షరతులతో ఎన్సీఆర్ పరిధిలో బాణసంచా ఉపయోగాన్ని అనుమతించవచ్చని కోర్టును కోరారు. జాతీయ పర్యావరణ ఇంజినీరింగ్ పరిశోధన సంస్థ ఆమోదించిన పర్యావరణ హిత బాణసంచా మాత్రమే తయారు చేసి, విక్రయించేలా సూచించాలని తుషార్ మెహతా కోరారు. అత్యధిక పేలుడు స్వభావమున్న టపాసులు తయారు చేయకుండా రాష్ట్రాలు, ఢిల్లీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటాయని అన్నారు. వ్యాపారులు కూడా అనుమతి పొందిన క్రాకర్లను మాత్రమే విక్రయించేలా చూడాలని అన్నారు.

# కాంగ్రెస్ పరువు పాయే

మొదటి పేజీ తరువాయి

చెప్పి వెంటనే ఎన్నికలు జరిపించాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ చెప్పినట్లు గ్రామ స్వరాజ్యం జరగాలంటే గ్రామ సచివాలయాలు, మండల కార్యాలయాలు, జిల్లా పరిషత్తులు సమర్థంగా నడవాలని అన్నారు. 73, 74 రాజ్యాంగ సవరణలు రాజీవ్ గాంధీ తీసుకువచ్చారని గుర్తు చేశారు. 42 శాతం రిజర్వేషన్లు తీసుకొచ్చి ఎన్నికలు జరుపుతామని కాంగ్రెస్ చెప్పిందని, ఇప్పుడు ప్రజలకు ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. మహారాష్ట్రలో ఎన్నికల్లో గెలిచిన తర్వాత కూడా పదవులు పోయాయని గుర్తు చేశారు. బీహార్‌లో, కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఉన్నప్పటికీ రిజర్వేషన్లను కోర్టులు కొట్టివేస్తే ఏమీ చేయలేకపోయామని అన్నారు. దేశంలో ఇంత చరిత్ర కళ్ళ ముందు కనిపిస్తున్నా కాంగ్రెస్ ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయటం మంచిది కాదని వ్యాఖ్యానించారు. ఈ ప్రభుత్వం మోసం చేయకుండా, 42 శాతం రిజర్వేషన్‌తో వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గతంలో పనిచేసిన వార్డు మెంబర్లు, సర్పంచులకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెద్ద పెద్ద



కాంట్రాక్టర్లకు బిల్లులు ఇస్తున్నారని, వీరికి మాత్రం ఇవ్వడం లేదని విమర్శించారు. గత దసరాకు ఇస్తామని చెప్పిన బిల్లులు ఈ దసరాకు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. పనులు చేసిన వారు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలలోపే పాత బిల్లులన్నింటినీ చెల్లించాలని డిమాండ్ చేశారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో డైట్ ఛార్జీలు రావడం లేదని ఈటల రాజేందర్ ఆరోపించారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆరు నెలలుగా వేతనాలు రావడం లేదని అన్నారు. విద్యార్థులకు భోజనం పెట్టలేని పరిస్థితుల్లో సరఫరాదారులు కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలకు కనీసం అన్నం పెట్టాలనే ఆలోచన కూడా లేదా అని మండిపడ్డారు. అంగన్వాడీలు, ఆశా వర్కర్లు వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గెస్ట్ లెక్చరర్లు సైతం వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ పాలన సరిగా లేదనే ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించారని గుర్తుంచుకోవాలని అన్నారు. ఈ గెలుపు రేవంత్ రెడ్డిదో, కాంగ్రెస్ పార్టీదో కాదని, అన్ని వర్గాలు కేసీఆర్‌ను కాదనుకుని ఓటు వేయడం వల్ల గెలిచారని అన్నారు. ఆరోగ్యం, విద్యతో పాటు వివిధ శాఖల్లో ఉన్న చిన్న ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు అదే రోజు చెక్కులు అందజేస్తామని చెప్పిన హామీ నెరవేరలేదని అన్నారు. ఇప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి మాట్లాడుతున్నారని, కానీ మీరు అధికారంలోకి వచ్చే ముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలియదా అని ప్రశ్నించారు. అప్పుల గురించి గతంలో ఎన్నోసార్లు అసెంబ్లీలో మాట్లాడారని గుర్తు చేశారు. అన్నీ తెలిసి కూడా హామీలు ఎందుకు ఇచ్చారని నిలదీశారు. ఎండాకాలంలో కొనుగోలు చేసిన సన్న వడ్లకు ఇప్పటి వరకు రూ. 500 బోనస్ రాలేదని, రుణమాఫీ కూడా పూర్తి స్థాయిలో జరగలేదని విమర్శించారు.

## విద్య, ఉద్యోగవాణి

ఏపీ ఇంటర్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

ఏపీ ఇంటర్మీడియట్-2025 పరీక్షల ఫీజు చెల్లింపు గడువు శుక్రవారంతో ముగుస్తుండటంతో ఈ నెల 22 వరకు దాన్ని బోర్డ్ పొడిగించింది. జనరల్, వొకేషనల్ కోర్సులు చదివే ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ రెగ్యులర్, ప్రయివేటు అభ్యర్థులు గడువులోగా ఫీజు చెల్లించాలని సూచించింది. రూ.1,000 ఆలస్య రుసుముతో ఈ నెల 30 వరకు ఫీజు చెల్లించవచ్చు. ఇదే చివరి ఛాన్సు అని మరోసారి పొడిగింపు ఉండదని ఇంటర్ బోర్డ్ కార్యదర్శి భరత్ గుప్తా స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో పెరిగిన ఇళ్ల రిజిస్ట్రేషన్లు

**సెప్టెంబర్‌లో రూ. 4,804 కోట్లకు చేరిన లావాదేవీల విలువ**

**గతేడాదితో పోలిస్తే 70 శాతం పెరిగిన రిజిస్ట్రేషన్ల విలువ**

**కోటి రూపాయలు పైబడిన ఇళ్ల అమ్మకాల్లో 151 శాతం వృద్ధి**

**రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోనే అత్యధిక రిజిస్ట్రేషన్లు**



హైదరాబాద్, అక్టోబర్ 10 (ఈవార్తలు): హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ కొత్త రికార్డులను సృష్టిస్తోంది. సాధారణంగా అమ్మకాలు నెమ్మదిగా సాగే పితృపక్షాల సమయంలోనూ రిజిస్ట్రేషన్ల జోరు తగ్గలేదు. సెప్టెంబర్ నెలలో నగరంలో జరిగిన గృహ రిజిస్ట్రేషన్ల విలువ ఏకంగా రూ. 4,804 కోట్లకు చేరింది. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే ఇది 70 శాతం అధికమని ప్రముఖ ప్రాపర్టీ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా శుక్రవారం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. నివేదిక ప్రకారం, సెప్టెంబర్‌లో మొత్తం నివాస గృహాల రిజిస్ట్రేషన్లు గతేడాదితో పోలిస్తే 35 శాతం పెరిగాయి. ముఖ్యంగా, ఖరీదైన, విలాసవంతమైన ఇళ్ల కొనుగోలుకు నగరవాసులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారని స్పష్టమైంది. కోటి రూపాయల కంటే ఎక్కువ విలువైన ఇళ్ల రిజిస్ట్రేషన్లు ఏకంగా 151 శాతం పెరిగాయి. మొత్తం లావాదేవీల విలువలో ఈ ప్రీమియం ఇళ్ల వాటానే 53 శాతంగా ఉండటం గమనార్హం. అదేవిధంగా, మొత్తం రిజిస్ట్రేషన్లలో వీటి వాటా 22 శాతానికి చేరింది. ఈ సందర్భంగా నైట్ ఫ్రాంక్ ఇండియా ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శిశిర్ బైజల్ మాట్లాడుతూ, "హైదరాబాద్ రెసిడెన్షియల్ మార్కెట్ తన వృద్ధిని నిలకడగా కొనసాగిస్తోంది. పితృపక్షాల వంటి ఆఫ్ సీజన్ లో కూడా రిజిస్ట్రేషన్లు భారీగా పెరగడం మార్కెట్ బలాన్ని సూచిస్తోంది. కొనుగోలుదారులు పెద్ద, ఖరీదైన ఇళ్ల వైపు ఆసక్తి చూపుతున్నారనడానికి ఈ గణాంకాలే నిదర్శనం" అని తెలిపారు. రిజిస్ట్రేషన్ అయిన ఆస్తులలో అత్యధికంగా 67 శాతం ఇళ్లు 1,000 నుంచి 2,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్నాయి. 2,000 చదరపు అడుగుల కంటే పెద్ద ఇళ్ల వాటా కూడా గతేడాది 13 శాతం నుంచి ఈసారి 15 శాతానికి పెరిగింది. హైదరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల పరిధిలో ఈ రిజిస్ట్రేషన్లు జరిగాయి. అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 45 శాతం, మేడ్చల్–మల్కాజిగిరిలో 40 శాతం, హైదరాబాద్ జిల్లాలో 14 శాతం రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయని నివేదిక వివరించింది.

## నవీన్ యాదవ్‌కు సుమన్ మద్దతు

జూబ్లీహిల్స్/హైదరాబాద్, అక్టోబర్ 10 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు తన మద్దతు ఉంటుందని ప్రముఖ తెలుగు సినీ నటుడు సుమన్ ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఒక వీడియోను విడుదల చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో చిన్న శ్రీశైలం యాదవ్ కుమారుడు నవీన్ యాదవ్‌కు కాంగ్రెస్ టిక్కెట్ ఇచ్చినందుకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. నవీన్ యాదవ్ యువకుడని, సేవా నిరతి కలిగిన వ్యక్తి అని సుమన్ కొనియాడారు. ఈసారి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నవీన్ యాదవ్‌కు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ ఉప ఎన్నికల్లో తన మద్దతు నవీన్‌కు ఎప్పుడూ ఉంటుందని, ఆయనను అత్యంత మెజార్టీతో గెలిపించాలని కోరారు. "ఆల్ ది బెస్ట్ నవీన్, టేక్ కేర్" అని ఆయన ముగించారు. యూసుఫ్‌గూడ, రెహ్మత్ నగర్ తదితర ప్రాంతాల్లో చిన్న శ్రీశైలం యాదవ్ పేరు సుపరిచితం. ఆయన ప్రత్యక్ష రాజకీయాల్లో లేకపోయినప్పటికీ రాజకీయాలతో పరోక్షంగా సంబంధాలు కలిగి ఉన్నారు.

# విశాఖ ఇక మినీ ముంబై

**ఏపీ కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు**



అమరావతి, అక్టోబర్ 10 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, అభివృద్ధి ప్రస్థానంలో రాష్ట్ర ప్రభుత్వం ఒక చారిత్రాత్మక ముందడుగు వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన కేబినెట్ సమావేశంలో రాష్ట్రానికి రూ. 1.17 లక్షల కోట్ల విలువైన భారీ పెట్టుబడుల ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసినట్టు తెలుస్తోంది. ఈ నిర్ణయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊతాన్ని ఇవ్వడంతో పాటు, వేలాది ఉద్యోగాల కల్పనకు మార్గం సుగమం చేస్తుందని ప్రభుత్వం విశ్వాసం వ్యక్తం చేస్తోంది. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయాలు పారిశ్రామిక రంగంలో ఏపీని అగ్రస్థానంలో నిలబెడతాయని భావిస్తున్నారు. ఈ కేబినెట్ సమావేశంలో విశాఖపట్నం అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. విశాఖను దేశ ఆర్థిక రాజధాని ముంబై తరహాలో ఒక శక్తివంతమైన ఆర్థిక, సాంకేతిక కేంద్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. ఇప్పటికే గూగుల్, టీసీఎస్ వంటి ప్రపంచ ప్రఖ్యాత టెక్ దిగ్గజాలు విశాఖకు వస్తున్నాయని, నగరాన్ని ఒక అంతర్జాతీయ ఐటీ హబ్‌గా మార్చడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ పెట్టుబడులతో విశాఖ స్వరూపం పూర్తిగా మారిపోనుందని, మౌలిక సదుపాయాలు మెరుగుపడి ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేసే దిశగా కూడా కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. అమరావతిలో రూ. 212 కోట్ల అంచనా వ్యయంతో నూతన రాజ్‌భవన్ నిర్మాణానికి పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. దీంతో పాటు, రాజధాని పరిధిలోని మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్లలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు అవసరమైన నిధులలో 25% సీఆర్డీఏ ద్వారా కేటాయించాలని నిర్ణయించారు. ఈ చర్యలతో రాజధాని ప్రాంతంలో మౌలిక వసతుల కల్పన మరింత ముందుకు సాగనుంది. వీటితో పాటు పలు సంస్థలకు అవసరమైన భూ కేటాయింపులు, ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన కరువు భత్యం (డీఏ) వంటి అంశాలపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రులను ఉద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, కేవలం పెట్టుబడులకు ఆమోదం తెలపడమే కాకుండా, ఆయా సంస్థలు క్షేత్రస్థాయిలో తమ కార్యకలాపాలను వేగంగా ప్రారంభించేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత శాఖల మంత్రులపై ఉందని స్పష్టం చేశారు. "రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడానికి ఎంతో కష్టపడుతున్నాం. ఈ ప్రణాళికల ఫలాలు ప్రజలకు చేరేలా, వాటి ప్రాముఖ్యతను వారికి అర్థమయ్యేలా వివరించాలి," అని ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో మంత్రులు చురుకైన పాత్ర పోషించాలని ఆయన సూచించారు.

# ఆరోగ్యశ్రీపై కుట్ర: షర్మిల




విజయవాడ, అక్టోబర్ 10 (ఈవార్తలు): ఏపీలో ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం భారీ కుట్రకు పాల్పడుతోందని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రైవేట్ ఆరోగ్య బీమాను ప్రవేశపెట్టడం వెనుక, పేదలకు సంజీవనిలాంటి ఆరోగ్యశ్రీ పథకాన్ని పూర్తిగా చంపేసే దురుద్దేశం దాగి ఉందని ఆమె ఆరోపించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల కోసం ఆరోగ్యశ్రీని ఒక దైవవరంగా తీసుకొస్తే, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు దానిని నిర్వీర్యం చేస్తూ రాక్షసుడిలా వ్యవహరిస్తున్నారని షర్మిల విమర్శించారు. నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ. 2,700 కోట్ల బకాయిలు పేరుకుపోవడం వల్లే, ఆయా ఆసుపత్రులు సమ్మెకు దిగాయని, నెల రోజులుగా ఓపీ సేవలు నిలిచిపోయినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని అన్నారు. ఇది ప్రజారోగ్యంపై ప్రభుత్వానికున్న నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రతి కుటుంబానికి రూ. 25 లక్షల ఆరోగ్య బీమా ఇస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు, ఇప్పుడు దానిని కేవలం 10 శాతానికి కుదించి రూ. 2.5 లక్షల ప్రైవేట్ బీమాతో సరిపెట్టడం మోసగించడమేనని షర్మిల ఆరోపించారు. "రూ. 2.5 లక్షలు దాటితే మళ్లీ ఆరోగ్యశ్రీ కింద ఇస్తామనడంలో ఆంతర్యం ఏమిటి? ప్రైవేట్ కంపెనీలకు లాభం చేకూర్చేందుకే ప్రభుత్వ పథకాన్ని బలి చేస్తున్నారా?" అని ఆమె ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీ కోసం ఏటా రూ. 4 వేల కోట్లు కేటాయించడానికి వెనుకాడే ప్రభుత్వం, ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు వేల కోట్లు ఎలా దోచిపెడుతుందని నిలదీశారు. దేశంలో ప్రైవేట్ బీమాను అమలు చేసిన 18 రాష్ట్రాల్లో 16 రాష్ట్రాలు తిరిగి ప్రభుత్వ ట్రస్ట్ విధానానికే మళ్లాయని షర్మిల గుర్తుచేశారు. ప్రైవేట్ బీమా వల్ల ప్రజలపై భారం తప్ప ప్రయోజనం లేదని ఆ రాష్ట్రాలు గ్రహించాయని తెలిపారు. ఇంతకాలం విజయవంతంగా నడుస్తున్న ట్రస్ట్ విధానాన్ని పక్కనపెట్టి, ప్రైవేట్ బీమాను ఎందుకు తీసుకొస్తున్నారో చంద్రబాబు సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే ప్రైవేట్ బీమాకు అనుసంధానించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, ట్రస్ట్ విధానంలోనే ఆరోగ్యశ్రీని కొనసాగించాలని కోరారు. ఆసుపత్రులకు ఉన్న రూ. 2700 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేసి, వైద్య సేవలు పునరుద్ధరింపజేయాలని ఆమె డిమాండ్ చేశారు.

# ఎద్దులతో విద్యుత్ ఉత్పత్తి

**నెల్లూరు ప్రాజెక్ట్‌పై చంద్రబాబు ఆశ్చర్యం!**



నెల్లూరు, అక్టోబర్ 10 (ఈవార్తలు): సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్న ఈ రోజుల్లో ఎద్దుల శక్తితో విద్యుత్తును ఉత్పత్తి చేయడం తనను ఎంతగానో ఆశ్చర్యపరిచిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. బొగ్గు, నీరు, సౌర, పవన విద్యుత్ గురించి విన్నాం కానీ, ఎద్దులతో విద్యుత్ ఉత్పత్తి చేయడం దేశంలోనే ఇది మొదటిసారని ఆయన ప్రశంసించారు. శుక్రవారం నెల్లూరు జిల్లాలో పర్యటించిన ఆయన, విశ్వసముద్ర గ్రూప్ చేపట్టిన పలు వినూత్న ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. విశ్వసముద్ర గ్రూప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'నందగోకులం – సేవ్ ది బుల్' కార్యక్రమం చాలా విశిష్టమైనదని చంద్రబాబు కొనియాడారు. ఒకప్పుడు మన రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన ఒంగోలు జాతి గిత్తలు ఇప్పుడు అంతరించిపోయే దశకు చేరుకోవడం బాధాకరమని అన్నారు. "మన దగ్గర కనుమరుగవుతున్న ఒంగోలు జాతిని బ్రెజిల్ దేశం పరిరక్షించి, ప్రపంచానికి అందిస్తుండటం మనం ఆలోచించాల్సిన విషయం. ఈ నేపథ్యంలో ఒంగోలు జాతి పరిరక్షణకు 'సేవ్ ది బుల్' నినాదంతో ముందుకు రావడం అభినందనీయం" అని చంద్రబాబు పేర్కొన్నారు. ఎద్దుల శక్తితో 5 యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తూ 'పవర్ ఆఫ్ బుల్స్' అంటే ఏమిటో చాటిచెప్పారని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో భాగంగా, పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన నందగోకులం లైఫ్ స్కూల్‌ను చంద్రబాబు ప్రారంభించారు. సాధారణ విద్యార్థులను అసాధారణ వ్యక్తులుగా తీర్చిదిద్దే ఈ ప్రయత్నం గొప్పదని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "సమాజం మనకు ఎంతో ఇస్తుంది. సమాజం సహకారంతో పైకి వచ్చిన ప్రతి ఒక్కరూ తిరిగి సమాజానికి సేవ చేయాలి. డబ్బు ఇవ్వడం మాత్రమే కాదు, ఇలాంటి మంచి పనుల ద్వారా భావితరాలకు ఉత్తమ పౌరులను అందించాలి" అని పిలుపునిచ్చారు. చింతా శశిధర్ ఫౌండేషన్ పీ4 మోడల్‌లో ఈ స్కూల్‌ను అద్భుతంగా నడుపుతోందని ప్రశంసించారు. అనంతరం, రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో ఏర్పాటు చేస్తున్న విశ్వసముద్ర బయో ఎనర్జీ ఇథనాల్ ప్లాంట్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. సుమారు 15,000 టన్నుల ధాన్యం నూకలతో ఇథనాల్ తయారు చేయడం వల్ల రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని, పర్యావరణ పరిరక్షణకు ఇది దోహదపడుతుందని వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందని, దగదర్తిలో విమానాశ్రయం, కృష్ణపట్నం పోర్టు, జాతీయ రహదారి, రైల్వే కనెక్టివిటీ వంటి మౌలిక సదుపాయాలు అభివృద్ధికి బాటలు వేస్తాయని భరోసా ఇచ్చారు. "2047 నాటికి భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుస్తుంది. అందులో ఆంధ్రప్రదేశ్‌ను నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం. విశాఖలో రూ. 87 వేల కోట్లతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సెంటర్ రాబోతోంది. పేదరికాన్ని నిర్మూలించే బాధ్యతను అందరూ తీసుకోవాలి" అని చంద్రబాబు అన్నారు.

# అల్లుడైతేనేం.. బీఆర్ఎస్సే నా పార్టీ

**క్లారిటీ ఇచ్చిన తలసాని శ్రీనివాస్ యాదవ్**

**కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌తో బంధుత్వం**

హైదరాబాద్, అక్టోబర్ 10 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో తనపై వస్తున్న ఊహాగానాలకు బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఫుల్‌స్టాప్ పెట్టారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌తో బంధుత్వం ఉన్నప్పటికీ, తన పూర్తి మద్దతు బీఆర్ఎస్ పార్టీకే ఉంటుందని ఆయన తేల్చిచెప్పారు. బంధుత్వం వేరు, రాజకీయ అనుబంధం వేరని స్పష్టం చేస్తూ, ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమానాలు అవసరం లేదన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అన్ని ప్రధాన పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారిన విషయం తెలిసిందే. బీఆర్ఎస్ నుంచి దివంగత మాగంటి గోపీనాథ్ అర్ధాంగి మాగంటి సునీత, కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్ బరిలో ఉన్నారు. అయితే, నవీన్ యాదవ్, తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు బంధువు కావడంతో, ఆయన మద్దతు ఎవరికి ఉంటుందనే దానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. ఈ ప్రచారంపై సికింద్రాబాద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తలసాని స్పష్టత ఇచ్చారు. "నవీన్ యాదవ్‌తో నాకు బంధుత్వం ఉన్న మాట నిజమే. గతంలో అతనికి రాజకీయంగా కొన్ని సూచనలు కూడా ఇచ్చాను. కానీ, ఇప్పుడు పరిస్థితులు వేరు. నేను బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేగా ఉన్నాను. అలాంటప్పుడు మా పార్టీ అభ్యర్థిని కాదని వేరే వారికి ఎలా మద్దతిస్తాను?" అని తలసాని ప్రశ్నించారు. తాను పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని, బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నానని ఆయన పునరుద్ఘాటించారు. పార్టీ కార్యక్రమాల్లో తాను చురుగ్గా పాల్గొంటున్నానని తలసాని గుర్తుచేశారు. ఆర్టీసీ బస్సు ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా గురువారం కేటీఆర్‌తో కలిసి బస్ భవన్‌కు వెళ్లిన విషయాన్ని ప్రస్తావించారు. తన విధేయత ఎప్పటికీ బీఆర్ఎస్ పార్టీకేనని, జూబ్లీహిల్స్‌లో తమ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గెలుపు కోసమే పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు.

## రూ.కోటి విలువైన డ్రగ్స్ పట్టివేత

**మరో కేసులో 3 కోట్ల హవాలా డబ్బు పట్టివేత**

మల్కాజిగిరి, అక్టోబర్ 10 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలో రాచకొండ పోలీసులు రూ. 1 కోటి విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. మల్కాజ్‌గిరి ఎస్ఓటీ, కీసర పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో 7 కిలోల ఓపీఎం, 2 కిలోల పాపిస్ట్రా డ్రగ్స్‌ను పట్టుకున్నారు. ఈ కేసులో ఒక వ్యక్తిని అరెస్టు చేయగా, మరో నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. రాష్ట్రంలో డ్రగ్స్‌ను కట్టడి చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈగిల్ టీమ్ మరో విజయవంతమైన ఆపరేషన్ నిర్వహించింది. నైజీరియా డ్రగ్స్ ముఠా డబ్బు బదిలీ నెట్‌వర్క్‌ను ఛేదించింది. డ్రగ్స్ దందాకు సంబంధించిన రూ. 3 కోట్ల హవాలా డబ్బును ముంబైలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## మా హయాంలోనే రియల్ బూమ్: భట్టి



హైదరాబాద్, అక్టోబర్ 10 (ఈవార్తలు): హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన ప్రభుత్వ వేలంలో ఎకరం భూమి రూ. 177 కోట్లకు అమ్ముడుపోవడం నగర రియల్ ఎస్టేట్ రంగం ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో తెలియజేస్తోందని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. హైటెక్స్‌లో జరిగిన తెలంగాణ నరేడ్కో ప్రాపర్టీ షోను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్ మహానగరాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రతి సంవత్సరం పట్టణాభివృద్ధి ప్రణాళిక వ్యయంలో భాగంగా బడ్జెట్‌లో రూ. 10,000 కోట్లు కేటాయిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. మురుగునీటి శుద్ధి ప్లాంట్లు, తాగునీటి అవసరాల కోసం దాదాపు రూ. 13,000 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మరే ఇతర నగరంలో లేని విధంగా హైదరాబాద్‌లో 24 గంటలు నాణ్యమైన విద్యుత్, మంచినీటి సరఫరా జరుగుతోందని ఆయన అన్నారు. భవిష్యత్తులో నగరంలో ఎలక్ట్రికల్ బస్సులే నడుస్తాయని ఆయన తెలిపారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఎలక్ట్రిక్ వాహనాలకు పన్ను మినహాయింపులు కల్పించినట్లు ఆయన వెల్లడించారు. రియల్టర్లు, బిల్డర్లను సంపద సృష్టికర్తలుగా రాష్ట్ర ప్రభుత్వం గౌరవిస్తుందని ఆయన అన్నారు. వారి సమస్యలను పరిష్కరించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

## పేదింటి విద్యార్థికి అండగా కవిత

హైదరాబాద్, అక్టోబర్ 10 (ఈవార్తలు): పేదింటి విద్యార్థిని చదువు కోసం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అండగా నిలిచారు. ముషీరాబాద్‌కు చెందిన ఆశ్రితకు మల్లారెడ్డి టెక్నికల్ క్యాంపస్‌లో కంప్యూటర్ సైన్స్‌లో సీటు లభించింది. అయితే, ఇటీవల ఆశ్రిత తండ్రి హఠాన్మరణం చెందడంతో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంది. ఆశ్రిత కాలేజీ ఫీజు చెల్లించడం ఆ కుటుంబానికి భారంగా మారింది. ఈ విషయాన్ని స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులు కవిత దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన కవిత, విద్యార్థిని కాలేజీ ఫీజు మొత్తాన్ని తానే భరిస్తానని హామీ ఇచ్చారు. అంతేకాదు, తన వాగ్దానాన్ని నిలబెట్టుకుంటూ ఆశ్రిత మొదటి సంవత్సరం ఫీజు మొత్తాన్ని ఆమె తల్లికి అందజేశారు.

## నేడు కోయంబత్తూరుకు కేటీఆర్

**ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి హాజరు**

హైదరాబాద్, అక్టోబర్ 10 (ఈవార్తలు): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం కోయంబత్తూరు పర్యటనకు వెళ్లనున్నారు. దేశవ్యాప్తంగా వివిధ ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొనే ప్రతిష్ఠాత్మకమైన 10వ ఎఫ్ఎంఏఈ–నేషనల్ స్టూడెంట్ మోటార్ స్పోర్ట్స్ కాంపిటీషన్–2025 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమం కోయంబత్తూరులోని కుమారగురు ఇన్‌స్టిట్యూషన్స్‌లో జరగనుంది. ఈ విషయాన్ని బీఆర్ఎస్ తన అధికారిక సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ విద్యార్థులు తమ సాంకేతిక ప్రతిభను ప్రదర్శించే ఈ జాతీయ పోటీలకు కేటీఆర్ హాజరవుతుండడం గర్వకారణమని పేర్కొంది. యువతలో ఆవిష్కరణా దృక్పథం, సాంకేతిక ప్రోత్సాహం, మోటార్‌స్పోర్ట్స్ రంగంలో కొత్త ప్రతిభను వెలికితీసే వేదికగా ఈ కార్యక్రమం నిలుస్తుందని తెలిపింది.

## లొంగిపోయిన ముగ్గురు మావోయిస్టులు

హైదరాబాద్, అక్టోబర్ 10 (ఈవార్తలు): డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట ముగ్గురు కీలక మావోయిస్టులు లొంగిపోయారు. మావోయిస్టులతో వచ్చిన సైద్ధాంతిక విభేదాల కారణంగా, పోలీసులు ఇచ్చిన పిలుపు మేరకు వారు లొంగిపోయినట్లు డీజీపీ మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కుంకటి వెంకటయ్య అలియాస్ వికాస్, మొగిలిచర్ల వెంకట్రాజు అలియాస్ చందు, తోడెం గంగ అలియాస్ సోని మావోయిస్టు పార్టీ నుంచి బయటకు వచ్చి జనజీవన స్రవంతిలో కలిసిపోతున్నట్లు తెలిపారు. ఈ ముగ్గురూ మావోయిస్టు పార్టీలో రాష్ట్ర కమిటీ స్థాయి నాయకులని తెలిపారు. సిద్దిపేట జిల్లాకు చెందిన కుంకటి వెంకటయ్య 1990లో పీడబ్ల్యూడీ ఏర్పాటు చేసిన రైతు కూలీ సభలకు హాజరై, ఆ తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లినట్లు చెప్పారు. పీడబ్ల్యూడీ కమాండర్ బాలన్న ఆధ్వర్యంలో దళంలో చేరారని, 35 ఏళ్లలో వివిధ హోదాల్లో పనిచేశారని తెలిపారు. ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు జనజీవన స్రవంతిలో కలవాలనుకున్నట్లు డీజీపీ చెప్పారు. హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామానికి చెందిన వెంకట్రాజు 11 ఏళ్ళ వయస్సులో విప్లవ గీతాలకు ఆకర్షితుడై మావోయిస్టు ఉద్యమంలో చేరాడని డీజీపీ వెల్లడించారు. 1993లో నర్సంపేట దళంలో చేరి, వివిధ హోదాల్లో పని చేసినట్లు చెప్పారు. ఇప్పుడు తన భార్య గంగతో కలిసి జనజీవన స్రవంతిలో కలిసేందుకు పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు చెప్పారు. ఇటీవలి కాలంలో 403 మంది మావోయిస్టులు లొంగిపోయారని డీజీపీ వెల్లడించారు.

## డీప్ ఫేక్.. చంద్రబాబు ఫొటోతో బురిడీ

**మోసపోయిన తెలంగాణ టీడీపీ నేతలు**

విజయవాడ, అక్టోబర్ 10 (ఈవార్తలు): డీప్ ఫేక్ టెక్నాలజీతో ఏకంగా ఏపీ సీఎం చంద్రబాబు, దేవినేని ఉమ పేరుతో బురిడీ కొట్టించాడో ఆకతాయి. అసలేం జరిగిందంటే.. గత నెల 30న ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన కొందరు టీడీపీ నాయకులకు ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. తాను దేవినేని ఉమ పీఏనని పరిచయం చేసుకుని, కాసేపట్లో ఉమ గారు వీడియో కాల్ చేస్తారని చెప్పాడు. చెప్పినట్టే, దేవినేని ఉమ ముఖంతో ఉన్న వ్యక్తి వీడియో కాల్ చేసి మాట్లాడాడు. తెలంగాణలో పార్టీని బలోపేతం చేయాలని, కార్యకర్తల పిల్లల చదువులకు సాయం చేయాలని కోరాడు. ఇది నిజమని నమ్మిన నేతలు, అతను చెప్పిన నంబర్లకు రూ. 35 వేలు ఫోన్ పే ద్వారా పంపించారు. ఈ నెల 7న అదే వ్యక్తి మరోసారి దేవినేని ఉమలా వీడియో కాల్ చేసి, స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ బీ–ఫామ్స్ ఇప్పిస్తానని ఆశ చూపాడు. ఆశ్చర్యకరంగా, స్వయంగా సీఎం చంద్రబాబు కూడా మాట్లాడతారని నమ్మబలికాడు. కొద్దిసేపటికే చంద్రబాబు ముఖంతో ఉన్న వ్యక్తి వీడియో కాల్లో మాట్లాడి, తెలంగాణలో పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని సూచించాడు. దీంతో సత్తుపల్లి నేతలు నిజంగానే సీఎం మాట్లాడారని పూర్తిగా నమ్మేశారు. అమరావతి వస్తే బీ–ఫామ్స్ ఇప్పిస్తానని నమ్మించడంతో సత్తుపల్లికి చెందిన 18 మంది టీడీపీ నేతలు విజయవాడకు చేరుకున్నారు. మోసగాడి సూచన మేరకు బందరు రోడ్డులోని ఓ హోటల్‌లో దిగారు. ఆ కేటుగాడు హోటల్ యాజమాన్యానికి కూడా ఫోన్ చేసి, తన వాళ్లే వస్తున్నారని, బిల్లు తానే చెల్లిస్తానని చెప్పడంతో వారూ నమ్మారు. సాయంత్రం వరకు ఎదురుచూసినా ఎవరూ రాకపోగా, సీఎంను కలవాలంటే ఒక్కొక్కరు రూ. 10 వేలు ఇవ్వాలని మరోసారి ఫోన్ రావడంతో నేతలకు అనుమానం కలిగింది.



# జగిత్యాలలో డ్రగ్స్ తనిఖీలు

జగిత్యాల టౌన్, అక్టోబర్ 10 (ఈవార్తలు): డ్రగ్స్ రహిత జగిత్యాల జిల్లా కోసం పోలీసులు నిత్యం డ్రగ్స్‌పై నిఘా పెడతున్నారు. తాజాగా శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. జగిత్యాల కొత్త బస్టాండ్, చుట్టుపక్కల ప్రదేశాల్లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో జగిత్యాల టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, సిబ్బంది, పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ బారిన పడి యువకులు జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్‌తో పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# 10 వేల లంచంతో పట్టుబడ్డ పంచాయతీ సెక్రటరీ



గంగాధర, అక్టోబర్ 10 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర మండలం మధురానగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి అనిల్‌పై అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి అనిల్ లంచం తీసుకుంటున్నట్టు ఫిర్యాదు అందింది. వల పన్నిన ఏసీబీ అధికారులు.. మధురా నగర్ గ్రామానికి చెందిన గంగాధర శ్రీకాంత్ అనే వ్యక్తి దగ్గర ఇందిరమ్మ ఇంటి బిల్లు కోసం డబ్బులు రూ.10,000 తీసుకుంటుండగా, అనిల్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.




# 'గొలుసుకట్టు' వద్దు బ్రో!

**లాభాల పేరుతో డబ్బు వసూళ్లు.. అమాయక ప్రజలకు కుచ్చుటోపీ**

**మెటా ఫండ్ ప్రో నిందితుల అరెసు.. జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ వెల్లడి**

జగిత్యాల టౌన్, అక్టోబర్ 10 (ఈవార్తలు): గొలుసుకట్టు వ్యాపారం పేరుతో డబ్బు వసూలు చేసి, మోసం చేసిన ముగ్గురు నిందితులను జగిత్యాల పోలీసులను అరెస్టు చేశారు. మెటా ఫండ్ ప్రో యాప్‌ను క్రియేట్ చేసి, రూ.లక్ష పెట్టుబడికి రూ.3 లక్షలు సంపాదించొచ్చని వీరు ఆశ చూపుతున్నట్లు గుర్తించారు. క్రిప్టో కరెన్సీలో పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టి లాభాలు ఆశించవచ్చని కొడిమ్యాలకు చెందిన కస్తూరి రాకేశ్, సింగిరెడ్డి తిరుపతి రెడ్డి, వీరబత్తిని రాజు.. కొందరి వద్ద రూ.20 లక్షలు వసూలు చేశారు. పైగా, గోవా, సింగపూర్, దుబాయ్‌కి ఉచితంగా టూర్‌కు పంపిస్తామని ఆశ చూపారు. రోజులు గడిచినా, నిందితుల నుంచి స్పందన లేకపోవడంతో అనుమానం వచ్చి బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటపడింది. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు. నిందితుల వద్ద ల్యాప్‌టాప్, రూ.లక్ష నగదు, మూడు బ్యాంకు పాస్‌బుక్స్, ఏటీఎం కార్డులు, క్రెడిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కేసు వివరాలను జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ మీడియాకు వెల్లడించారు. ప్రజలు గొలుసుకట్టు వ్యాపారాలు చేసి మోసపోవద్దని, విదేశీ టూర్లకు పంపిస్తామని చెప్పేవారి మాటలు నమ్మవద్దని సూచించారు. సమావేశంలో డీఎస్పీ రఘుచందర్, మల్యాల సీఐ రవి, కొడిమ్యాల ఎస్సై సందీప్ పాల్గొన్నారు.

# ఆర్టీఐ విప్లవాత్మకం

**జగిత్యాల డీసీవో మనోజ్ కుమార్**




జగిత్యాల టౌన్, అక్టోబర్ 10 (ఈవార్తలు): పాలనలో సమాచార హక్కు చట్టం విప్లవాత్మకమైనదని జిల్లా సహకార అధికారి సీహెచ్ మనోజ్ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా సహకార అధికారి కార్యాలయంలో సమాచార హక్కు చట్టం వారోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. సమాచార హక్కు చట్టం ద్వారా పాలనలో విప్లవాత్మక మార్పులు వచ్చినట్టు పేర్కొన్నారు. పాలనలో పారదర్శకత ఏర్పడిందన్నారు. సమాచార హక్కు చట్టం కింద వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న డీసీవో కార్యాలయ సూపరింటెండెంట్ ఎండీ అసద్ సమాచార హక్కు చట్టాన్ని వివరించారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి, కార్యాలయ సిబ్బంది బీ సుజాత, సాయికుమార్ గౌడ్, ఏ మల్లేశం, నాగసంకీర్త్, చైతన్య, స్వప్న, సహకార సంఘాల కార్యదర్శులు పాల్గొన్నారు.

# సూర్య ధన్వంతరి ఆలయంలో కుంకుమ పూజలు

జగిత్యాల టౌన్, అక్టోబర్ 10 (ఈవార్తలు): జగిత్యాల పట్టణం చింతకుంటలోని సూర్య ధన్వంతరి దేవాలయంలో శుక్రవారం ఘనంగా కుంకుమార్చన నిర్వహించారు. సంకటహర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకొని లలిత సహస్ర నామాల స్తోత్ర పారాయణం చేశారు. మాతలు అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించారు. కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ వడ్లగట్ట రాజన్న, వొడ్నాల శ్రీనివాస్, మహిళా సమితి సభ్యులు వొడ్నాల లత, వడ్లగట్ట స్వాతి, ప్రసన్న, రజిత, గంగమ్మ, అర్చకుడు నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# వివాహిత సూసైడ్ కేసులో భర్తకు 8 ఏళ్ల జైలు శిక్ష

జగిత్యాల రూరల్, అక్టోబర్ 10 (ఈవార్తలు): వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న కేసులో భర్తకు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి రత్న పద్మావతి 8 ఏళ్ల జైలు శిక్ష విధించారు. వివరాల్లోకెళితే.. నిజామాబాద్ జిల్లా రెంజెర్ల మండలం వీరన్నగుట్టకు చెందిన గుంబే పావనిని జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీపూర్‌కు చెందిన భానుతో పెళ్లి చేశారు. అయితే, అదనపు కట్నం కోసం పావనిని భాను వేధించాడు. దీంతో మనస్తాపం చెందిన ఆమె.. 2019 మే 3న అత్తగారింట్లోనే పురుగులమందు తాగింది. ఆస్పత్రికి తరలించేలోగా చనిపోయింది. మృతురాలి తండ్రి ర్యావని చెన్నయ్య ఫిర్యాదులో కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. భాను(30)ను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా, జడ్జి తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్ష పడటంలో కృషిచేసిన పీపీ మల్లేశం, అప్పటి ఇన్వెస్టిగేషన్ డీఎస్పీలు ఎం వెంకటరమణ, పీ వెంకటరమణ, అప్పటి ఎస్సై సతీశ్, సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్ట్ కానిస్టేబుల్ నరేశ్, సీఎంఎస్ కానిస్టేబుల్ కిరణ్ కుమార్‌ను ఎస్పీ అభినందించారు.

# వ్యక్తిగత ఫొటోలతో వేధింపులు

**యువతి నుంచి రూ.5 లక్షలు డిమాండ్**

**ఇన్‌స్టాగ్రాం ఫేక్ ఐడీతో బ్లాక్‌మెయిల్**

**నిందితుడి అరెస్టు, రిమాండ్‌కు తరలింపు**

చందుర్తి (రాజన్న సిరిసిల్ల జిల్లా), అక్టోబర్ 10 (ఈవార్తలు): యువతి వ్యక్తిగత ఫొటోలను అడ్డుపెట్టుకొని డబ్బులు డిమాండ్ చేస్తూ, బెదిరింపులకు పాల్పడిన ఆకతాయిని చందుర్తి పోలీసులు, షీ టీమ్ సమన్వయంతో అరెస్ట్ చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితుడిని చాకచక్యంగా పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చందుర్తి మండలానికి చెందిన ఓ యువతి వ్యక్తిగత ఫొటోలను అనంతపల్లి గ్రామానికి చెందిన సలేంద్ర వేణు (31), తన స్నేహితుడైన పోలే ప్రశాంత్ (29) వద్ద నుంచి తీసుకున్నాడు. ఈ ఫొటోలను ఉపయోగించి నిందితుడు ఇన్‌స్టాగ్రామ్‌లో ఫేక్ ఐడీ సృష్టించాడు. ఆ ఫేక్ ఐడీ ద్వారా బాధితురాలికి మెసేజ్‌లు పంపి, వ్యక్తిగత ఫొటోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తానని బెదిరిస్తూ ఆమె నుండి రూ.5 లక్షలు డిమాండ్ చేశాడు. దీంతో ఆ యువతి షీ టీమ్స్‌ను, చందుర్తి పోలీసులను సంప్రదించింది. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. సాంకేతిక ఆధారాల సహాయంతో వేణును గుర్తించి శుక్రవారం మధ్యాహ్నం పట్టుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ జీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. యువతులు తమ వ్యక్తిగత ఫొటోలను ఎవరికీ షేర్ చేయొద్దని, సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.




# పక్కాగా పంట కొనుగోళ్లు

**జగిత్యాల జిల్లాలో 421 కొనుగోలు కేంద్రాలు**

**అన్ని కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి**

**నిర్వాహకులు నిరంతరం అలర్ట్ గా ఉండాలి**

**రిజిస్టర్ల నిర్వహణ పక్కాగా ఉండాలి**

**48 గంటల్లో డేటా 100% నమోదు చేయాలి**

**జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాలు**

**ఖరీఫ్ పంట కొనుగోళ్లపై అవగాహన సదస్సు**

జగిత్యాల టౌన్, అక్టోబర్ 10 (ఈవార్తలు): గత రెండు సీజన్లలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు జరిగిందని, ఈ సారి కూడాపక్కా ప్రణాళికతో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరగాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. వానకాలం( ఖరీఫ్) పంట కొనుగోలుకు సంబంధించి, సివిల్ సప్లై, డీఆర్డీవో, మార్కెటింగ్, మార్క్‌ఫెడ్, జిల్లా, మండల, గ్రామ స్థాయి వ్యవసాయ శాఖ అధికారులు, గన్నీ గోదాం ఇంచార్జులు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్లతో శుక్రవారం కలెక్టరెట్లోని మీటింగ్ హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. 2025-26 సంవత్సరానికి జిల్లాలో 3.15 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు అయ్యిందని, 7.50 - 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు అంచనా వేసి అందుకు తగ్గ ఏర్పాట్లు చేశామన్నారు. కనీస మద్దతు ధర గ్రేడ్ 'ఏ' - రూ.2,389 కాగా, బోనస్‌గా క్వింటాలుకు రూ.500 చెల్లిస్తామని అన్నారు. అలాగే సాధారణ రకానికి రూ.2,369 మద్దతు ధర ఉందన్నారు. వరి ధాన్యం కొనుగోలు కోసం ఐకేపీ 137, పాక్స్ 283, మెప్మా 1.. మొత్తం మొత్తం 421 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. ప్రతి కేంద్రంలో కొనుగోలుకు సంబంధించిన రిజిస్టర్లు, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, వెయింగ్ యంత్రాలు, టార్పాలిన్ మొదలైన వసతులు ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. ఏ రోజు వచ్చిన ధాన్యం అదే రోజు కొనుగోలు అవ్వాలని రైతులు వెయిటింగ్ చేసే పరిస్థితి ఉండకూడదన్నారు. ప్రతి కేంద్రం లో అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, అన్ని రిజిస్టర్లు అప్డేట్‌గా ఉండే విధంగా చూడాలని, ప్రతి కేంద్రంలో టోల్ ఫ్రీ నెంబర్‌ను ప్రదర్శించాలన్నారు. ఎంత ధాన్యం వచ్చింది? ఎంత కొనుగోలు చేశారు? తేమ శాతం ఎంత ఉంది? రైస్‌మిల్‌కు ఎంత ధాన్యం పంపించారు? ఎంత మంది రైతులకు పేమెంట్ అయ్యింది? మొదలగు వివరాలన్నీ ప్రతి కేంద్రంలో ఉండాలన్నారు. అవసరమైన మేర గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండాలన్నారు. హమాలీ కొరత లేకుండా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని, ధాన్యం రవాణాకు అవసరమైన వాహనాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని, కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతులను నిర్వాహకులు కల్పించాలని స్పష్టం చేశారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలు పై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, తేమ శాతం చూసుకొని నాణ్యమైన ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుక వచ్చేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత తదితరులు పాల్గొన్నారు.

# బీసీల రాజ్యాధికారం సాధిస్తాం

**నోటికాడి ముద్ద లాక్కొన్నారు**

**జాతీయ బీసీ సంఘం నేత నీరటి రాజకుమార్**

**హైకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా బీసీ సంఘాల నిరసన**



పెగడపల్లి, అక్టోబర్ 10 (ఈవార్తలు): బీసీల రాజ్యాధికారం సాధించేందుకు మరింత కృషి చేస్తామని జాతీయ బీసీ సంఘం పెగడపల్లి మండల అధ్యక్షుడు నీరటి రాజ్ కుమార్ అన్నారు. బీసీ రిజర్వేషన్‌పై స్టే విధిస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో తీర్పునకు వ్యతిరేకంగా బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పెగడపల్లి మండల కేంద్రంలో అంబేద్కర్ కూడలి వద్ద పెద్ద ఎత్తున బీసీ సంఘాల నేతలు పాల్గొని, నిరసనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ.. నోటి కాడి ముద్దను లాక్కున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే కాలంలో బీసీల రాజ్యాధికారం కోసం బీసీలంతా ఏకమై ముకుమ్మడిగా బీసీ రిజర్వేషన్ల ప్రక్రియ ముందుకు సాగేందుకు ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించే ప్రక్రియను అడ్డుకున్న అగ్రవర్ణాల పోకడను మానుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి గర్వందుల శేఖర్ గౌడ్, బీసీ సంఘం గౌరవ అధ్యక్షుడు బండారి బీరయ్య, బీసీ సంఘం సలహాదారుడు ముల్క రాజేశం, మాజీ సింగిల్ విండో చైర్మన్ చిందం తిరుపతి, మాజీ సహకార సంఘం డైరెక్టర్ తోటమల్లేశం, కట్ల సత్తయ్య, చెట్లతిరుపతి, పుల్కం జలపతి, బాగినేని మల్లయ్య, గంగుల కొమురెల్లి, గొల్లపల్లి రామచంద్రం, వరద రాము, కొత్తపెల్లి భాస్కర్, గర్వందుల రాజు గౌడ్, పలుమారు అంజయ్య, నాంపల్లి రమణాచారి, అంగలి సంతోశ్, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.




# హోంగార్డుకు ఘనమైన వీడ్కోలు

జగిత్యాల టౌన్, అక్టోబర్ 10 (ఈవార్తలు): పోలీస్ శాఖలో హోంగార్డ్‌గా గత 40 సంవత్సరాలుగా విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన హోంగార్డు అంజయ్యను శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అశోక్ కుమార్ సన్మానించారు. సుదీర్ఘ కాలంగా పోలీస్ శాఖలో విధులు నిర్వహించిన సిబ్బంది సేవలు మరువబోమని అన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబసభ్యులతో, అనందంగా, ఆయురారోగ్యాలతో గడపాలని ఎస్పీ ఆకాంక్షినారు. ఎలాంటి సమస్య వచ్చినా తనను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమొంలో ఆర్ఐ సైదులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఒంటరితనంతో మహిళ ఆత్మహత్య



మల్యాల, అక్టోబర్ 10 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని నూకపల్లి డబుల్ బెడ్ రూమ్స్ కాలనీకి చెందిన అన్వరి బేగం (37) ఉరి వేసుకుని సూసైడ్ చేసుకున్నట్లు ఎస్సై నరేష్ కుమార్ తెలిపారు. భర్త అబ్దుల్ రషీద్ జైల్లో ఉండటంతో, ఒంటరితనం, ఆర్థిక సమస్యల వల్ల జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కి ఉరి వేసుకుందని తెలిపారు. ఆమె మృతదేహాన్ని జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించగా, వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




# జిల్లాస్థాయి పోటీలకు గురుకుల బాలికలు

మల్యాల, అక్టోబర్ 10 (ఈవార్తలు): జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ (అండర్ 14, 17) వాలీబాల్, ఖో ఖో, కబడ్డీ పోటీలకు మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మానస తెలిపారు. మనీష, రేవతి, సంజన, సంజన, దర్శనీ, అక్షయ, అక్షిత, యశస్విని, హారిక ఎంపికయ్యారని, తర్వాత వీరు తరవాత ఉమ్మడి జిల్లా స్థాయిలో పాల్గొంటారని పేర్కొన్నారు.




# రాష్ట్రస్థాయి పోటీలకు వాగ్దేవి విద్యార్థులు

మల్యాల, అక్టోబర్ 10 (ఈవార్తలు): జిల్లా స్థాయి పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన మల్యాలలోని వాగ్దేవీ పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఎంపికైన విద్యార్థులు అంజని, తనయ, ఎస్ అక్షర, పీ ఆశ్రిత, ఆర్ రక్షిత, టీ అమూల్య, సీహెచ్ మధుమిత, ఏ సత్యవర్ధన్‌ను స్కూల్ కరస్పాండెంట్ పోకల నరేశ్ అభినందించారు. తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవడం గర్వకారణమని అన్నారు. ఆ పోటీల్లోనూ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. విద్యార్థులు అత్యుత్తమంగా తీర్చిదిద్దిన పీఈటీలు తిరుపతి, అక్షయ్, ఆశిక్, రేఖను అభినందించారు.



# రూ.2.5 లక్షల ఎల్వోసీ

జగిత్యాల టౌన్, రాయికల్, అక్టోబర్ 10 (ఈవార్తలు): కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కట్కాపూర్‌కి చెందిన తోగిటి లతకు శస్త్రచికిత్స కోసం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ రూ.2.5 లక్షల ఎల్వోసీ అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబం ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజమౌళి, రమేశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేకు జగిత్యాల ఎమ్మెల్యే పరామర్శ

శుక్రవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతి రెడ్డి తల్లి లక్ష్మీనర్సమ్మ మరణించగా, వారి కుటుంబ సభ్యులను నిజామాబాద్‌లో కలిసి పరామర్శిస్తున్న జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్. - జగిత్యాల/ నిజామాబాద్



# తాలిబన్ మంత్రి ప్రెస్‌మీట్‌లో మహిళలకు నో ఎంట్రీ

**ఎంపిక చేసిన 15-16 మంది జర్నలిస్టులకే అనధికారిక ఆహ్వానం.. సోషల్ మీడియాలో వెల్లువెత్తిన తీవ్ర విమర్శలు, వ్యతిరేకత**



న్యూఢిల్లీ: భారత పర్యటనలో ఉన్న ఆఫ్ఘనిస్థాన్ విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాఖీ ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశం తీవ్ర వివాదాస్పదంగా మారింది. శుక్రవారం ఢిల్లీలోని ఆఫ్ఘన్ రాయబార కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి మహిళా జర్నలిస్టులను అనుమతించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ చర్యపై సోషల్ మీడియాలోనూ పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమవుతోంది. వివరాల్లోకి వెళితే, శుక్రవారం మధ్యాహ్నం 3:30 గంటలకు ముత్తాఖీ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అయితే దీనికి విస్తృతస్థాయిలో మీడియా ప్రతినిధులను ఆహ్వానించలేదు. కేవలం 15-16 మంది జర్నలిస్టులను మాత్రమే ఎంపిక చేసి పిలిచారు. ముంబైలోని ఆఫ్ఘన్ కాన్సులేట్‌కు నేతృత్వం వహిస్తున్న తాలిబన్ అధికారి ఇక్రముద్దీన్ కామిల్ స్వయంగా కొందరు జర్నలిస్టులకు ఫోన్లు చేసి ఈ సమావేశానికి అనధికారికంగా ఆహ్వానించినట్లు సమాచారం. అయితే, ఈ జాబితాలో ఒక్క మహిళా జర్నలిస్టుకు కూడా చోటు కల్పించలేదు. ఈ పర్యటనలో భాగంగా గురువారం ముత్తాఖీ భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో చర్చలు జరిపారు. ఆఫ్ఘనిస్థాన్ అభివృద్ధి, ద్వైపాక్షిక వాణిజ్యం, ప్రజా సంబంధాలు వంటి అంశాలపై వారు చర్చించారు. ఈ సందర్భంగా కాబూల్‌లోని భారత టెక్నికల్ మిషన్‌ను పూర్తిస్థాయి రాయబార కార్యాలయంగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు భారత్ ప్రకటించింది. ఇంతటి కీలక పరిణామం తర్వాత జరిగిన మీడియా సమావేశానికి కొందరినే పిలవడం, మహిళలను పూర్తిగా దూరం పెట్టడంపై జర్నలిస్టు వర్గాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. తాలిబన్లతో భారత్ సంబంధాలు మెరుగుపడుతున్న సమయంలో, ఇలాంటి ముఖ్యమైన పరిణామంపై మీడియాను పరిమితం చేయడం సరైంది కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. పారదర్శకతను దెబ్బతీసేలా, మీడియా స్వేచ్ఛను అడ్డుకునేలా ఈ చర్య ఉందని విమర్శిస్తున్నారు.

## మా ధైర్యాన్ని పరీక్షించొద్దు

**భారత గడ్డపై నుంచి పాక్‌కు తాలిబన్ మంత్రి వార్నింగ్**

**ఆఫ్ఘనిస్థాన్‌లో ఉగ్రవాదాన్ని పూర్తిగా తుడిచిపెట్టామని వెల్లడి**

న్యూఢిల్లీ: భారత పర్యటనకు వచ్చిన ఆఫ్ఘనిస్థాన్ విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాఖీ, పొరుగు దేశం పాకిస్థాన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తమ దేశంలో ఉగ్రవాదాన్ని పూర్తిగా తుడిచిపెట్టామని స్పష్టం చేసిన ఆయన, శాంతి స్థాపన కోసం పాకిస్థాన్ కూడా తమ మార్గాన్ని అనుసరించాలని హితవు పలికారు. అంతేకాకుండా, కాబూల్‌పై జరిగిన వైమానిక దాడుల వెనుక పాకిస్థాన్ హస్తం ఉందని సంచలన ఆరోపణలు చేశారు. ఈరోజు భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో సమావేశమైన అనంతరం ముత్తాఖీ విలేకరులతో మాట్లాడారు. "గత నాలుగేళ్లలో లష్కరే తోయిబా, జైషే మహ్మద్ వంటి ఉగ్రవాద సంస్థలను ఆఫ్ఘన్ గడ్డపై నుంచి పూర్తిగా ఏరివేశాం. ప్రస్తుతం దేశంలో ఒక్క ఉగ్రవాది కూడా లేడు. అంగుళం భూమి కూడా వారి ఆధీనంలో లేదు" అని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పాకిస్థాన్‌ను ఉద్దేశించి, "శాంతి కోసం మేం చేసినట్లుగానే ఇతర దేశాలు కూడా ఉగ్రవాద సంస్థలపై చర్యలు తీసుకోవాలి" అని సూచించారు. కాబూల్ పేలుళ్ల గురించి మాట్లాడుతూ... "ఇలాంటి చర్యల ద్వారా సమస్యలు పరిష్కారం కావు. చర్చలకు మేం సిద్ధంగా ఉన్నాం. వాళ్ల సమస్యలను వాళ్లే పరిష్కరించుకోవాలి. 40 ఏళ్ల తర్వాత ఆఫ్ఘనిస్థాన్‌లో శాంతి నెలకొంది. దీనితో ఎవరికీ ఇబ్బంది ఉండకూడదు" అని ముత్తాఖీ అన్నారు. ఆఫ్ఘన్ల ధైర్యాన్ని పరీక్షించాలని ఎవరూ ప్రయత్నించవద్దని, అలా చేయాలనుకుంటే సోవియట్ యూనియన్, అమెరికా, నాటోలను అడిగి తెలుసుకోవాలని గట్టిగా హెచ్చరించారు. మరోవైపు, భారత్‌తో సంబంధాలపై ముత్తాఖీ ప్రశంసలు కురిపించారు. ఆఫ్ఘనిస్థాన్‌తో పూర్తిస్థాయి దౌత్య సంబంధాలను పునరుద్ధరించాలని భారత్ నిర్ణయించడంపై హర్షం వ్యక్తం చేశారు. కాబూల్‌లోని భారత టెక్నికల్ మిషన్‌ను పూర్తిస్థాయి రాయబార కార్యాలయంగా అప్‌గ్రేడ్ చేస్తామని జైశంకర్ హామీ ఇచ్చారని తెలిపారు. భూకంపం సంభవించినప్పుడు మొదటగా స్పందించి ఆదుకున్నది భారతేనని గుర్తుచేసుకున్నారు. పరస్పర గౌరవం, వాణిజ్యం ఆధారంగా భారత్‌తో బలమైన స్నేహాన్ని కోరుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.

## 699.96 బిలియన్ డాలర్లకు భారత ఫారెక్స్ నిల్వలు

న్యూఢిల్లీ/ముంబై: అక్టోబర్ 3తో ముగిసిన వారానికి భారత దేశ విదేశీ మారక నిల్వలు 699.96 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు ఆర్బీఐ శుక్రవారం విడుదల చేసిన డేటా ద్వారా వెల్లడైంది. రిజర్వులో ప్రధాన భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు ఈ వారంలో 577.71 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు ఈ డేటా తెలుపుతోంది. మొత్తం మీద విదేశీ మారక నిల్వలు గత వారంలో 700.24 బిలియన్ డాలర్ల నుంచి స్వల్పంగా తగ్గినప్పటికీ, బంగారం నిల్వలు 3.75 బిలియన్ డాలర్లకు పైగా పెరిగి 98.77 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు బంగారాన్ని సేకరించాయి. 2024 నుంచి ఆర్బీఐ బంగారం నిల్వలకు 75 టన్నులు జోడించింది. దీంతో భారత్ వద్ద బంగారం నిల్వలు 880 టన్నులకు చేరుకున్నాయి. ఇది ఇప్పుడు విదేశీ మారక నిల్వల్లో 14 శాతంగా ఉందని మోర్గాన్ స్టాన్లీ నివేదిక తెలిపింది. విదేశీ మారక నిల్వలు పెరగడం వల్ల ఆర్బీఐకి డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ బలోపేతం కావడానికి అధిక అవకాశం లభిస్తుంది. తగినంత ఫారెక్స్ నిల్వలు, రూపాయి విలువ మరింత పతనం కాకుండా నిరోధిస్తాయి. భారతదేశం వద్ద ఉన్న విదేశ మారక ద్రవ్యంతో 11 నెలలకు పైగా వస్తువుల దిగుమతి, దాదాపు 96 శాతం రుణాల చెల్లింపునకు నిధులు సమకూర్చుకోవచ్చని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు.

# అట్టుడుకుతున్న పాకిస్థాన్


**ఇస్లామాబాద్, రావల్పిండిలలో ఇంటర్నెట్ కట్**

**ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా టీఎల్‌పీ భారీ ర్యాలీకి పిలుపు**

**రాజధాని నగరానికి వెళ్లే అన్ని మార్గాలు మూసివేత**

**ప్రావిన్స్ అంతటా 10 రోజుల పాటు 144 సెక్షన్**

**లాహోర్‌లో పోలీసులతో ఘర్షణ.. తీవ్ర గాయాలు**




ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా తెహ్రీక్-ఏ-లబ్బైక్ పాకిస్థాన్ (టీఎల్‌పీ) అనే మతతత్వ పార్టీ తలపెట్టిన భారీ ర్యాలీ నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. శుక్రవారం జరగనున్న 'లబ్బైక్ యా అక్సా మిలియన్ మార్చ్' కారణంగా రాజధాని ఇస్లామాబాద్, రావల్పిండి నగరాల్లో మొబైల్, ఇంటర్నెట్ సేవలను నిరవధికంగా నిలిపివేశారు. ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా, రాజధానికి వెళ్లే అన్ని ప్రధాన మార్గాలను మూసివేసి దిగ్బంధించారు. నగరంలోని రెడ్ జోన్‌ను పూర్తిగా సీల్ చేసి, కేవలం అధికారిక పాసులు ఉన్నవారిని మాత్రమే మార్గల్లా రోడ్డు మీదుగా అనుమతిస్తున్నారు. అంతర్గత వ్యవహారాల మంత్రి మోహ్సిన్ నఖ్వీ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు తెలిపారు. దీంతోపాటు, పంజాబ్ ప్రావిన్స్ వ్యాప్తంగా 10 రోజుల పాటు 144 సెక్షన్‌ను అమలు చేశారు. దీని ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో నలుగురి కంటే ఎక్కువ మంది గుమికూడటంపై నిషేధం విధించారు. ఈ ర్యాలీకి ముందే లాహోర్‌లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. టీఎల్‌పీ చీఫ్ సాద్ హుస్సేన్ రిజ్వీని అరెస్ట్ చేసేందుకు పోలీసులు బుధవారం రాత్రి వారి ప్రధాన కార్యాలయంపై దాడి చేశారు. దీంతో టీఎల్‌పీ కార్యకర్తలు రాళ్లు, ఇనుప రాడ్లతో పోలీసులపై ఎదురుదాడికి దిగారు. ఈ ఘర్షణల్లో ఐదుగురు పోలీసులు, పదుల సంఖ్యలో ఆందోళనకారులు గాయపడినట్లు పోలీసు అధికారి ఒకరు తెలిపారు. అయితే, తమ కార్యకర్త ఒకరు మరణించగా, 20 మందికి గాయాలయ్యాయని టీఎల్‌పీ వర్గాలు ఆరోపించాయి. ప్రభుత్వ చర్యలను టీఎల్‌పీ తీవ్రంగా ఖండించింది. "శాంతియుతంగా తలపెట్టిన మా ర్యాలీని అడ్డుకోవడానికి ప్రభుత్వం నీచమైన చర్యలకు పాల్పడుతోంది. గాజాలో యూదులు ముస్లింలను అణచివేస్తుంటే, ఇక్కడ వారికి మద్దతిచ్చే వారు మమ్మల్ని అణచివేస్తున్నారు" అని టీఎల్‌పీ ప్రతినిధి ఆరోపించారు. పాలస్తీనాకు మద్దతు తెలపడం పాకిస్థాన్‌లో నేరంగా మారిందని ఆయన విమర్శించారు. నిర్బంధాలను ఆపకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రస్తుతం లాహోర్‌లోని టీఎల్‌పీ ప్రధాన కార్యాలయం వద్ద భారీగా పోలీసులను మోహరించారు. పరిస్థితి అదుపు తప్పితే పారామిలటరీ దళాలైన రేంజర్లను రంగంలోకి దించాలని పంజాబ్ ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం.

# మైక్రోసాఫ్ట్ సలహాదారుగా రిషి సునాక్

**ఏఐ స్టార్టప్ ఆంత్రోపిక్‌లోనూ చేరిన రిషి సునాక్**

**రెండు కంపెనీల్లోనూ సీనియర్ సలహాదారుగా జాబ్**



లండన్/న్యూయార్క్: బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్ తన రాజకీయ జీవితం తర్వాత కార్పొరేట్ ప్రపంచంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. ఆయన అమెరికాకు చెందిన టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్, ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) స్టార్టప్ ఆంత్రోపిక్‌లలో సీనియర్ సలహాదారుగా చేరినట్లు ప్రకటించారు. గత జులైలో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఓటమి తర్వాత కన్జర్వేటివ్ పార్టీ నాయకత్వ బాధ్యతల నుంచి తప్పుకున్న సునాక్, ప్రస్తుతం పార్లమెంట్ సభ్యునిగా కొనసాగుతున్నారు. ఈ కొత్త బాధ్యతల గురించి రిషి సునాక్ తన లింక్డ్‌ఇన్ పోస్టులో స్వయంగా వెల్లడించారు. ఈ రెండు పదవుల ద్వారా తనకు లభించే ఆదాయాన్ని మొత్తం తన భార్య అక్షతా మూర్తితో కలిసి ప్రారంభించిన 'ది రిచ్‌మండ్ ప్రాజెక్ట్' అనే ఛారిటీ సంస్థకు విరాళంగా ఇస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ నిర్ణయంపై పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఆంత్రోపిక్ సంస్థలో సునాక్ పాత్ర ప్రధానంగా అంతర్గత వ్యవహారాలకు, వ్యూహాత్మక సలహాలకు మాత్రమే పరిమితం కానుంది. ప్రపంచ ఆర్థిక, భౌగోళిక రాజకీయ పరిణామాలపై ఆయన కంపెనీకి మార్గనిర్దేశం చేస్తారు. ఇక మైక్రోసాఫ్ట్‌లో కూడా ఆయన ఇదే తరహా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. త్వరలో జరగబోయే మైక్రోసాఫ్ట్ వార్షిక సదస్సులో ఆయన ప్రసంగించనున్నట్లు తెలుస్తోంది. ఈ నియామకాలకు సంబంధించి బ్రిటన్‌లో మాజీ మంత్రులు, ఉన్నతాధికారుల కొత్త ఉద్యోగాలపై నిబంధనలను పర్యవేక్షించే 'అడ్వైజరీ కమిటీ ఆన్ బిజినెస్ అపాయింట్‌మెంట్స్' నిర్దేశించిన షరతులకు పూర్తిగా కట్టుబడి ఉన్నట్లు ఆంత్రోపిక్ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. నిబంధనల ప్రకారం, రిషి సునాక్ మంత్రి పదవి నుంచి వైదొలిగిన నాటి నుంచి రెండేళ్ల పాటు ఈ కంపెనీల తరఫున బ్రిటన్ ప్రభుత్వాన్ని లాబీయింగ్ చేయడానికి వీల్లేదు. అలాగే, ప్రభుత్వంలో ఉన్నప్పుడు తనకు తెలిసిన రహస్య సమాచారాన్ని ఈ పదవుల కోసం ఉపయోగించకూడదని ఏసీఓబీఏ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. గత జులైలో రిషి సునాక్ ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ గోల్డ్‌మన్ శాక్స్‌లో సలహాదారుగా తిరిగి చేరిన విషయం తెలిసిందే. 2000వ దశకం ప్రారంభంలో ఆయన ఇదే సంస్థలో అనలిస్ట్‌గా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించారు.

## ఖైదీలకూ ఓటు హక్కు!

**సుప్రీం విచారణ.. కేంద్రానికి, ఈసీకి నోటీసులు**

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా జైళ్లలో ఉన్న విచారణ ఖైదీలు, శిక్ష ఖరారు కాని సుమారు 4.5 లక్షల మందికి ఓటు హక్కును నిరాకరించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)పై విచారణకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ఈ అంశంపై స్పందన తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వం, భారత ఎన్నికల సంఘానికి (ఈసీఐ) శుక్రవారం నోటీసులు జారీ చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది. ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ద్వారా దాఖలైన ఈ పిటిషన్‌లో, ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 62(5) కింద ఖైదీలపై విధిస్తున్న నిషేధం రాజ్యాంగ హామీలకు, అంతర్జాతీయ ఒప్పందాలకు విరుద్ధంగా ఉందని వాదించారు. ఓటర్ల జాబితాలో పేరు ఉన్న ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం ప్రకారం ఓటు హక్కు ఉంటుందని, కేవలం నివాసం లేకపోవడం, మతిస్థిమితం కోల్పోవడం లేదా ఎన్నికల సంబంధిత నేరాలకు పాల్పడటం వంటి కారణాలతో మాత్రమే ఆ హక్కును నిరాకరించాలని పిటిషనర్లు పేర్కొన్నారు. వాస్తవానికి శాసనసభ్యులకు వర్తించాల్సిన ఈ నిబంధనను, జైల్లో ఉన్న సాధారణ ఓటర్లందరికీ వర్తింపజేయడం చట్టవిరుద్ధమని వాదించారు. ఈ నిషేధం వల్ల న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం తగ్గుతుందని, ఇది ఏకపక్షంగా ఉందని పిటిషన్‌లో ఆవేదన వ్యక్తం చేశారు. "భారత్‌లోని జైళ్లలో 75 శాతానికి పైగా విచారణ ఖైదీలే ఉన్నారు. వారిలో 80 నుంచి 90 శాతం మంది చివరికి నిర్దోషులుగా విడుదలవుతున్నారు. అయినా దశాబ్దాల పాటు వారు తమ ఓటు హక్కును కోల్పోతున్నారు" అని తెలిపారు. "జైల్లో ఉంటూ ఎన్నికల్లో పోటీ చేయడానికి అనుమతిస్తున్నప్పుడు, నేరం ఇంకా రుజువుకాని సాధారణ పౌరులకు ఓటు వేసే హక్కును ఎలా నిరాకరిస్తారు?" అని పిటిషనర్లు ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 1,350 జైళ్లలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదా పోస్టల్ బ్యాలెట్ విధానాన్ని అమలు చేయడం ద్వారా ఖైదీల ఓటు హక్కును సులభంగా కల్పించవచ్చని సూచించారు. అనేక దేశాల్లో ఇలాంటి సంపూర్ణ నిషేధం లేదని, పాకిస్థాన్‌లో సైతం విచారణ ఖైదీలకు ఓటు హక్కు ఉందని పిటిషన్‌లో ఉదహరించారు.

## దగ్గు మందు పిటిషన్ తిరస్కరణ

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలలో దగ్గు మందు కారణంగా చిన్నారులు మృతి చెందిన అంశంపై సీబీఐతో విచారణ జరపాలంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ప్రముఖ న్యాయవాది విశాల్ తివారి ఈ పిటిషన్ దాఖలు చేశారు. మొదట ధర్మాసనం నోటీసులు జారీ చేసేందుకు అంగీకరించింది. ఆ తర్వాత కేసును పరిశీలించిన అనంతరం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించేందుకు నిరాకరించింది. న్యూస్ పేపర్లు చదివి పిటిషనర్లు కోర్టును ఆశ్రయిస్తున్నారని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అన్నారు. తాను ఏ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించడం లేదని, కానీ తమిళనాడు, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలు ఈ విషయంలో తీవ్రమైన చర్యలు తీసుకున్నాయని పేర్కొన్నారు. వాటిని విస్మరించలేమని మెహతా కోర్టుకు తెలిపారు. డ్రగ్స్ చట్టాలు అమలు చేసేందుకు తగిన వ్యవస్థలు ఇప్పటికే ఆయా రాష్ట్రాల్లో ఉన్నాయని ఆయన అన్నారు.

## భారత మార్కెట్లోకి శాంసంగ్ గెలాక్సీ ఎమ్17 5జీ

ముంబై/న్యూఢిల్లీ: ప్రముఖ టెక్ దిగ్గజం శాంసంగ్, భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో మరో కొత్త బడ్జెట్ 5జీ ఫోన్‌ను విడుదల చేసింది. తన ఎమ్ సిరీస్‌లో భాగంగా 'గెలాక్సీ ఎమ్17 5జీ' మోడల్‌ను శుక్రవారం అధికారికంగా లాంచ్ చేసింది. సామాన్యులకు సైతం అందుబాటు ధరలో శక్తివంతమైన ఫీచర్లను అందిస్తూ, ముఖ్యంగా ఆరేళ్ల పాటు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్లు ఇస్తామని ప్రకటించడం ఈ ఫోన్ ప్రత్యేకతగా నిలుస్తోంది. యువతను, బడ్జెట్ వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని ఈ ఫోన్‌ను మూడు వేరియంట్లలో తీసుకొచ్చారు. బేస్ మోడల్ అయిన 4జీబీ ర్యామ్ ం 128జీబీ స్టోరేజ్ వేరియంట్ ధర రూ. 12,499గా నిర్ణయించారు. అలాగే, 6జీబీ ర్యామ్ ం 128జీబీ వేరియంట్ ధర రూ. 13,999 కాగా, 8జీబీ ర్యామ్ ం 128జీబీ టాప్ వేరియంట్ ధర రూ. 15,499గా ఉంది. ఈ స్మార్ట్‌ఫోన్ అమ్మకాలు అక్టోబర్ 13 నుంచి శాంసంగ్ ఇండియా వెబ్‌సైట్, అమెజాన్‌తో పాటు ప్రముఖ రిటైల్ స్టోర్లలో ప్రారంభమవుతాయి. మూన్‌లైట్ సిల్వర్, సఫైర్ బ్లాక్ రంగుల్లో ఇది అందుబాటులో ఉంటుంది.

## లాభాల్లో ముగిసిన మార్కెట్లు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజు శుక్రవారం కూడా లాభాలతో ముగిశాయి. ఫార్మా, బ్యాంకింగ్ రంగాల షేర్లలో బలమైన కొనుగోళ్లు జరగడంతో పాటు ఆటో, ఎనర్జీ షేర్లు కూడా రాణించడంతో సూచీలు లాభపడ్డాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 329 పాయింట్లు లాభపడి 82,501 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 104 పాయింట్లు పెరిగి 25,285 వద్ద ముగిసింది. ఈ ఉదయం ట్రేడింగ్ బలహీనంగా ప్రారంభమైంది. ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడితో సెన్సెక్స్ దాదాపు 100 పాయింట్లు నష్టపోయి 82,075 వద్ద మొదలైంది. అయితే, కొద్దిసేపటికే కోలుకుని ఇంట్రాడేలో 579 పాయింట్ల వరకు లాభపడి 82,654 గరిష్ఠ స్థాయిని తాకింది. నిఫ్టీ కూడా ట్రేడింగ్ సమయంలో 25,331 గరిష్ఠాన్ని నమోదు చేసింది. సెన్సెక్స్ ప్రధాన షేర్లలో ఎస్‌బీఐ 2 శాతానికి పైగా లాభపడగా, మారుతీ సుజుకి, యాక్సిస్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, పవర్ గ్రిడ్ షేర్లు ఒక శాతానికి పైగా లాభపడ్డాయి. మరోవైపు, టాటా స్టీల్ 1.5 శాతం నష్టపోగా, రెండో త్రైమాసిక ఫలితాల తర్వాత టీసీఎస్ షేరు సుమారు 1 శాతం క్షీణించింది. రంగాల వారీగా చూస్తే, బీఎస్ఈ హెల్త్‌కేర్, బ్యాంకెక్స్ సూచీలు ఒక శాతం వరకు లాభపడ్డాయి. ఆటో, క్యాపిటల్ గూడ్స్ సూచీలు అరశాతం మేర పెరిగాయి. ఇక బ్రాడర్ మార్కెట్‌లో బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.4 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.6 శాతం మేర లాభపడ్డాయి. మరోవైపు, భారత్, యూకే మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 2030 నాటికి రెట్టింపు కావచ్చన్న వార్తలతో టెక్స్‌టైల్ కంపెనీల షేర్లు ఇంట్రాడేలో 17 శాతం వరకు దూసుకుపోయాయి. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై సానుకూల అంచనాలు, మధ్యప్రాచ్యంలో భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గడం వంటి అంతర్జాతీయ అంశాలు ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని పెంచాయని విశ్లేషకులు తెలిపారు. పండుగ సీజన్ ప్రారంభంలో జీఎస్టీ సంస్కరణల కారణంగా వినియోగం పెరగడం, ఆర్‌బీఐ తీసుకుంటున్న చర్యలతో దేశీయ ఆర్థిక సూచికలు మెరుగుపడటం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచాయని నిపుణులు అభిప్రాయపడ్డారు. సాంకేతికంగా నిఫ్టీ రానున్న రోజుల్లో 25,500 – 25,550 స్థాయిలకు చేరే అవకాశం ఉందని, 25,150 వద్ద మద్దతు లభిస్తుందని వారు అంచనా వేశారు.

## గోల్డ్ లోన్.. నెలనెలా వడ్డీ కట్టాల్సిందే!

**బ్యాంకుల్లో కొత్త నిబంధనలు.. పెరిగిన రుణ ఎగవేతలే కారణం**



ముంబై: బంగారంపై రుణాలు తీసుకునే వారికి ముఖ్య గమనిక. ఇప్పటివరకు ఉన్నట్లుగా ఏడాది చివరిలో వడ్డీ చెల్లించే వెసులుబాటుకు కొన్ని బ్యాంకులు స్వస్తి పలుకుతున్నాయి. ఇకపై ప్రతినెలా తప్పనిసరిగా వడ్డీ చెల్లించాలంటూ కొత్త నిబంధనను అమలు చేస్తున్నాయి. బంగారం ధరలు పెరగడంతో రుణ ఎగవేతలు భారీగా పెరిగిపోవడమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. దేశంలో బంగారం ధరలు ఆకాశాన్నంటున్నాయి. దీంతో తక్కువ బంగారంపై ఎక్కువ రుణం పొందే అవకాశం పెరిగింది. ఇది ప్రజలను బాగా ఆకర్షిస్తోంది. ఇతర రుణాలతో పోలిస్తే 9 శాతం లోపు వడ్డీకే రుణం లభించడంతో గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా బంగారం రుణాలు 26 శాతం పెరిగాయి. అయితే, రుణం తీసుకున్నవారు ఏడాదిలోగా తిరిగి చెల్లించడంలో విఫలమవుతున్నారు. ఈ కారణంగా గోల్డ్ లోన్ విభాగంలో మొండి బకాయిలు 30 శాతానికి పైగా పెరిగాయి. ఈ సమస్యను అధిగమించేందుకే బ్యాంకులు వడ్డీ వసూలు విధానంలో మార్పులు చేశాయి. కొత్త నిబంధన ప్రకారం ప్రతినెలా వడ్డీ చెల్లించకపోతే దాని ప్రభావం నేరుగా కస్టమర్ సిబిల్ స్కోర్‌పై పడుతుందని బ్యాంకులు స్పష్టం చేస్తున్నాయి. సిబిల్ స్కోర్ తగ్గితే భవిష్యత్తులో ఇతర ఏ లోన్లు పొందాలన్నా కష్టమవుతుంది. ఖాతాదారుడి ఆర్థిక పరిస్థితిని బట్టే ఈ నిబంధనలను అమలు చేస్తున్నామని బ్యాంక్ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం పది గ్రాముల బంగారంపై సుమారు లక్ష రూపాయల వరకు రుణం ఇస్తున్నామని ఓ ప్రభుత్వ రంగ బ్యాంకు అధికారి తెలిపారు.

## రిటైర్డ్ ఇంజినీర్ ఫాంహౌజ్‌లో 17 టన్నుల తేనె

**కట్టలకొద్దీ నోట్లు, కిలోల కొద్దీ బంగారం**

**లగ్జరీ కార్లు.. నిర్మాణంలో 32 కాటేజీలు**

**మధ్యప్రదేశ్‌లో లోకాయుక్త దాడులు**

భోపాల్: మధ్యప్రదేశ్‌లో ఓ రిటైర్డ్ ప్రభుత్వ అధికారి ఇంట్లో జరిగిన లోకాయుక్త దాడులు పెను సంచలనం సృష్టించాయి. పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పీడబ్ల్యూడీ) రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ జి.పి.మెహ్రా నివాసాలు, ఇతర ఆస్తులపై గురువారం అధికారులు జరిపిన సోదాల్లో కుప్పలుతెప్పలుగా అక్రమాస్తులు బయటపడ్డాయి. నగదు, బంగారం మాత్రమే కాదు, ఏకంగా 17 టన్నుల తేనె నిల్వలను చూసి అధికారులు విస్తుపోయారు. ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయన్న పక్కా సమాచారంతో లోకాయుక్త డీఎస్పీ ర్యాంక్ అధికారుల నేతృత్వంలో బృందాలు ఏకకాలంలో భోపాల్, నర్మదాపురంలోని నాలుగు ప్రాంతాల్లో దాడులు ప్రారంభించాయి. భోపాల్‌లోని మణిపురం కాలనీలో ఉన్న మెహ్రా నివాసంలో రూ.8.79 లక్షల నగదు, సుమారు రూ.50 లక్షల విలువైన ఆభరణాలు, రూ.56 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను గుర్తించారు. సమీపంలోని ఓపల్ రీజెన్సీ అపార్ట్‌మెంట్‌లోని మరో ఇంట్లో సోదాలు చేయగా, రూ.26 లక్షల నగదు, రూ.3.05 కోట్ల విలువైన 2.6 కిలోల బంగారం, 5.5 కిలోల వెండి లభించాయి. లభించిన నగదును లెక్కించేందుకు కౌంటింగ్ మెషీన్లను వినియోగించాల్సి వచ్చింది. అయితే, అందరినీ ఆశ్చర్యానికి గురిచేసిన విషయం నర్మదాపురం జిల్లా సోహాగ్‌పూర్‌లోని ఆయన ఫామ్‌హౌస్‌లో వెలుగుచూసింది. అక్కడ అధికారులు ఏకంగా 17 టన్నుల తేనె నిల్వలను కనుగొన్నారు. అంతేకాకుండా, అదే ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న 32 కాటేజీలు, ఇప్పటికే పూర్తయిన ఏడు కాటేజీలు, ఆరు ట్రాక్టర్లు, చేపల పెంపకానికి ఓ చెరువు, గోశాల, ఒక గుడి కూడా ఉన్నట్లు గుర్తించారు. ఫోర్డ్ ఎండీవర్, స్కోడా స్లావియా, కియా సోనెట్, మారుతి సియాజ్ వంటి లగ్జరీ కార్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. మెహ్రా బినామీ సంస్థగా భావిస్తున్న గోవింద్‌పురాలోని కేటీ ఇండస్ట్రీస్‌లోనూ సోదాలు జరిపి, రూ.1.25 లక్షల నగదుతో పాటు పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం మీద ఇప్పటివరకు రూ.36 లక్షలకు పైగా నగదు, 2.6 కిలోల బంగారం, 5.5 కిలోల వెండితో పాటు పలు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఇన్సూరెన్స్ పత్రాలు, షేర్ డాక్యుమెంట్లను గుర్తించినట్లు లోకాయుక్త అధికారులు తెలిపారు. ఆస్తుల విలువ ఇంకా లెక్కిస్తున్నామని, దీని విలువ అనేక కోట్లలో ఉంటుందని అంచనా వేస్తున్నారు. స్వాధీనం చేసుకున్న పత్రాలను ఫోరెన్సిక్ బృందాలు పరిశీలిస్తున్నాయని, మెహ్రా ఆర్థిక లావాదేవీలపై లోతుగా దర్యాప్తు చేస్తున్నామని అధికారులు వివరించారు.

## సహజీవనం చేస్తే 50 ముక్కలైతరు

**విద్యార్థినులకు యూపీ గవర్నర్ హెచ్చరిక**

లక్నో: ఉత్తర్ ప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్ లివ్-ఇన్ రిలేషన్ (సహజీవనం)పై మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. సహజీవనం అనే ధోరణికి అమ్మాయిలు దూరంగా ఉండాలని, లేదంటే భాగస్వాముల చేతిలో దారుణంగా 50 ముక్కలుగా నరికివేయబడుతున్న ఘటనలను చూడాల్సి వస్తుందని ఆమె తీవ్ర స్వరంతో హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. వారణాసిలోని మహాత్మాగాంధీ కాశీ విద్యాపీఠ్ 47వ స్నాతకోత్సవంలో ఆనందీబెన్ పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ, "నేను అమ్మాయిలకు ఒక్కటే చెప్పాలనుకుంటున్నాను. ఈ రోజుల్లో లివ్-ఇన్ సంబంధాలు ఒక ట్రెండ్‌గా మారాయి. కానీ, దయచేసి దానికి దూరంగా ఉండండి" అని స్పష్టం చేశారు. భాగస్వాముల మధ్య హింసకు సంబంధించిన వార్తలు తనను తీవ్రంగా బాధిస్తున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

ఈవార్తలు
వినోదవాణి
CINEMA
శనివారం 11-10-2025 www.evarthalu.com


వయ్యారి చిత్రం



కళ్యాణి ప్రియదర్శన్



# ఎస్ఎస్ఎంబీ 29 టైటిల్‌గా 'వారణాసి'!

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్ ఎస్ రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా ఎస్ఎస్ఎంబీ29. కొన్ని నెలల క్రితం షూటింగ్ మొదలవ్వగా.. ఇప్పుడు శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే నాలుగు షెడ్యూల్స్ పూర్తయ్యాయి. ప్రస్తుతం మరో షెడ్యూల్ జెట్ స్పీడ్‌లో జరుగుతోంది. అయితే, ఇప్పటివరకు మూవీ నుంచి రాజమౌళి.. ఒక్కటంటే ఒక్క అప్డేట్ కూడా అఫీషియల్‌గా ఇవ్వలేదు. కొద్ది రోజుల క్రితం రాజమౌళి సోషల్ మీడియాలో మహేష్ ప్రీ లుక్‌ను షేర్ చేయగా.. అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. పూర్తి ఫస్ట్ లుక్ నవంబర్ 16న రిలీజ్ చేయనున్నట్లు జక్కన్న ప్రకటించారు. టైటిల్ అనౌన్స్మెంట్ అప్పుడే ఉంటుందని టాక్. సినిమాకు వారణాసి టైటిల్‌ను ఫిక్స్ చేసినట్లు కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతోంది. కానీ ఇప్పటి వరకు దానిపై రాజమౌళి స్పందించలేదు. అవునో కాదో కూడా చెప్పలేదు. కానీ ఇండస్ట్రీ బజ్ ప్రకారం.. సినిమా టీజర్ కట్ ను ఇప్పటికే వీఎఫ్ ఎక్స్ టీమ్ కు వారణాసి అనే వర్కింగ్ టైటిల్‌తో రాజమౌళి పంపినట్లు టాక్ వినిపిస్తోంది.

# స్టార్ హీరో కొడుకుతో అనుపమ డేటింగ్?

మలయాళీ ముద్దుగుమ్మ అనుపమ పరమేశ్వరన్ తమిళంలో తాజాగా చేసిన సినిమా బైసన్. ఇందులో అనుపమ హీరోయిన్ కాగా.. చియాన్ విక్రమ్ కుమారుడు ధ్రువ్ విక్రమ్ హీరోగా నటించారు. ఇది లవ్ అండ్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతోంది. కాగా, ఈ సినిమా షూటింగ్ సమయంలో అనుపమ- ధ్రువ్ మధ్య ఫ్రెండ్ షిప్ బాండింగ్ ఏర్పడింది. అప్పట్నుంచి ఇద్దరూ క్లోజ్ గా ఉంటున్నారని, ఈ ఇద్దరూ రిలేషన్ షిప్లో ఉన్నారని ఇండస్ట్రీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇది సోషల్ మీడియాలోనూ వైరల్ గా మారింది. అయితే దీనిపై మీడియా డైరెక్ట్ గా అనుపమనే ప్రశ్నించింది. బైసన్ ప్రమోషన్స లో రీసెంట్ గా పాల్గొన్న అనుపమకు డేటింగ్ రూమర్స్ గురించి అడిగారు. ఈ ప్రశ్న నుంచి అనుపమ తెలివిగా తప్పించుకుంది. దీనికి సమాధానం చెప్పకుండా దాటవేస్తూ.. అందుకు బదులుగా బైసన్ సినిమాలో ధ్రువ్ నటన, డెడికేషన్ గురించి చెబుతూ ప్రశంసలు కురిపించింది. దీంతో అనుపమ తెలివిగా సమాధానం చెప్పిందని కొందరు అనగా.. మరికొందరూ నిజంగా డేటింగ్ లో ఉందా అని ఆరా తీస్తున్నారు.



# కాళ్లు విరగొడతామన్నారు: నిహారిక

మిత్రమండలితో హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తోన్న నిహారిక సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్ అన్న సంగతి తెలిసిందే. సినిమాలో ప్రియదర్శికి జోడీగా నటిస్తోంది. అయితే ఇన్ ఫ్లూయెన్సర్ గా మొదలైన నిహారిక ప్రయాణం సినిమా హీరోయిన్ వరకూ వస్తానని మాత్రం ఊహించలేదని తాజాగా తెలిపింది. యూట్యూబ్ ఛానల్ వచ్చిన కొత్తలో తాను ఛానల్ ను సరదాగా మొదలు పెట్టినట్లు తెలిపింది. ఇన్ స్టా, ఫేస్ బుక్ వంటి మాధ్యమాలు కూడా అలా మొదలు పెట్టిన వాటిగానే పేర్కొంది. అప్పటికే అవి జనాలకు కొత్త కావడంతో అలవాటు పడటానికి చాలా సమయం పట్టిందన్నారు. వాటి నుంచి ఆదాయం రావడానికి రెండు..మూడేళ్లు సమయం పట్టిందన్నారు. అయితే ఈ విషయం ఇంట్లో తెలియడంతో ఇలాంటివన్నీ టైంపాస్ గా మాత్రమే చేయమని..అదే జీవితం అని అక్కడే కూర్చుని ఉండొద్దని సీరియస్ గానే చెప్పారుట. ఇలాంటి పిచ్చి పిచ్చి పనులు చేస్తే కాళ్లు విరగొట్టి ఇంట్లో కూర్చోబెడతామని ఓసందర్భంలో తల్లిదండ్రులు నేరుగా హెచ్చరికలు కూడా జారీ చేసినట్లు గుర్తు చేసుకుంది.



# రౌడీ బేబీ జంట రిపీట్!

ప్రముఖ డైరెక్టర్ మారి సెల్వరాజ్ దర్శకత్వంలో ధనుష్, సాయి పల్లవి మళ్లీ జతకట్టనున్నారు. దర్శకుడు మారి సెల్వరాజ్ నటనకు బలమైన స్కోప్ వున్న పాత్రలను రూపొందించడంలో ప్రసిద్ధి చెందారు. అందులో భాగంగానే రౌడీ బేబీ జంటను తిరిగి తెరపై చూడడానికి ప్రజలు ఆసక్తి



కనబరుస్తున్న నేపథ్యంలో వీరిద్దరితోనే ఒక అద్భుతమైన కథను తెరపైకి తీసుకురాబోతున్నారట మారి సెల్వరాజ్. నవంబర్ నెలలో ప్రీ ప్రొడక్షన్ పనులు ప్రారంభించి.. వచ్చే ఏడాది 2026 ప్రారంభంలో ఈ సినిమా షూటింగ్ మొదలు పెట్టాలని మేకర్స్ భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో ఈ కాంబో కోసం అభిమానులు చాలా ఆసక్తి కనబరిస్తున్నట్లు తెలుస్తోంది.



# డైలమాలో శ్రీనిధి శెట్టి


విక్టరీ వెంకటేష్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ సినిమా ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఇందులో హీరోయిన్ ఎవరు? అన్నది ఇంకా ఫైనల్ కాలేదు. పలువురు హీరోయిన్ల పరిశీల అనంతరం కన్నడ బ్యూటీ శ్రీనిధి శెట్టిని తీసుకున్నట్లు బలమైన ప్రచారం సాగింది. పరిశీలనలో ఉన్న శ్రీనిధిశెట్టినే తీసుకున్నారని గట్టి ప్రచారం జరుగుతోంది. ఇదే విషయాన్ని శ్రీనిధి ముందుకు తీసుకెళ్తే కొన్ని గంటల ముందు తనకి అలాంటి అవకాం రాలేదని చెప్పుకొచ్చింది. కానీ రాత్రికి రాత్రే సీన్ మారినట్లు తాను ఆ సినిమాలో ఉన్నానో? లేదో? నిర్మాతలే ప్రకటిస్తారంటూ కొత్త పల్లవి అందుకుంది. దీంతో సినిమాలో తానే హీరోయిన్ కాకపోతే ఆ మాట ఎందుకంటుందంటూ మీడియా కోడై కూస్తుంది. ఈ విషయంలో శ్రీనిధి శెట్టి కక్కలేక..మింగలేని స్థితిలో ఉన్నట్లు కనిపిస్తోంది.

# '8 గంటలు'తో.. దీపిక డిస్టర్బ్

బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపిక పదుకొనే కల్కి 2898 ఏడి చిత్రంతో టాలీవుడ్ లో అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. తన కెరీర్ లో ఇప్పటివరకూ అత్యుత్తమమైన పాన్ ఇండియా విజయం ఈ సినిమాతోనే సాధ్యమైంది. అయితే కల్కి 2898 ఏడి సీక్వెల్ నుంచి దీపికను తొలగించడం విస్తృతంగా



చర్చలకు తెర తీసింది. అంతకుముందే సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న స్పిరిట్ మూవీ నుంచి తొలగించిన తర్వాత ఈ ప్రకటన రావడం పెద్ద డిబేట్ కి కారణమైంది. బ్యాక్ టు బ్యాక్ రెండు భారీ ప్రాజెక్టుల నుంచి తొలగించడంతో దీపిక వైఖరిపై చాలా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో దీపిక పదుకొనే పరిశ్రమ గురించి మాట్లాడుతూ.. ఇది అస్తవ్యస్థమైన వ్యవస్థ అని వేలెత్తి చూపారు. ఈ వ్యవస్థలో హీరోలను ఒకలా హీరోయిన్లను మరోలా ట్రీట్ చేస్తుందనే అర్థం వచ్చేలా మాట్లాడారు. అంతేకాదు చాలా మంది హీరోలు రోజూ 8గంటలు పని చేస్తారు కానీ, వారంతంలో అసలు పని చేయరు! అని కూడా విమర్శించారు. మహిళను కాబట్టి నాపై ఒత్తిడి చేస్తున్నారు. కానీ భారతీయ చిత్ర పరిశ్రమలో చాలా మంది సూపర్ స్టార్లు, మేల్ స్టార్లు సంవత్సరాలుగా ఎనిమిది గంటలు పని చేస్తున్నారనేది రహస్యం కాదు.. వారు అంతకుమించి ప్రాజెక్టుకు కేటాయించరు.. అయినా ఎప్పుడూ వారిని హెడ్ లైన్స్ లోకి తీసుకురాలేదు!%--% అని కూడా అన్నారు.



# కే ర్యాంప్‌లో 16 కిస్‌లు

తెలుగు సినిమాల్లో ముద్దు సీన్స్ కామన్ అయ్యాయి. కానీ రాబోయే కిరణ్ అబ్బవరం కే ర్యాంప్ సినిమా మరోసారి ముద్దు సీన్స్ గురించి చర్చ జరిగేలా చేసే అవకాశాలు ఉన్నాయట. ఎందుకంటే కే ర్యాంప్ సినిమాలో కిరణ్ అబ్బవరం హీరోయిన్‌తో ఏకంగా 16 సార్లు లిప్ లాక్ చేశాడని అంటున్నారు. కథ బలంగా డిమాండ్ చేయడంతో తప్పలేదని అంటున్నారు. కిరణ్ అబ్బవరం సినిమా అనగానే ఒక సింపుల్, మిడిల్ క్లాస్ కుర్రాడి సినిమా గుర్తుకు వస్తుంది. ఆయన ఎక్కువ శాతం అలాంటి పాత్రలే చేశాడు. అయితే ఈసారి అందుకు భిన్నంగా ఆయన సినిమా, ఆయన పాత్ర ఉండే అవకాశం ఉందని కె ర్యాంప్ సినిమా యొక్క ప్రమోషనల్ స్టఫ్ ను చూస్తే అనిపిస్తోంది. దానికి తోడు ఈ సినిమాలో ఆయన 16 లిప్ లాక్ ముద్దులు పెట్టాడు అంటూ వార్తలు వస్తున్న నేపథ్యంలో అందరి దృష్టి సినిమాపై పడింది.





# జైస్వాల్ జైత్రయాత్ర

## సెంచరీతో కదం తొక్కిన టీమిండియా ఓపెనర్

## భారీ స్కోర్ దిశగా భారత జట్టు

**వెస్టిండీస్‌తో రెండో టెస్ట్‌లో టీమిండియా భారీ స్కోర్ దిశగా సాగుతోంది. యశస్వి జైస్వాల్(253 బంతుల్లో 22 ఫోర్లతో 173 బ్యాటింగ్) అజేయ శతకానికి తోడుగా.. సాయి సుదర్శన్(165 బంతుల్లో 12 ఫోర్లతో 87) హాఫ్ సెంచరీతో రాణించడంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 90 ఓవర్లలో 2 వికెట్లకు 318పరుగులు చేసింది. క్రీజులో యశస్వి జైస్వాల్‌తో పాటు కెప్టెన్ శుభ్‌మన్ గిల్(20 బ్యాటింగ్) ఉన్నాడు. వెస్టిండీస్ బౌలర్లలో జోమెల్ వార్రి కెన్ ఒక్కడే రెండు వికెట్లు తీసాడు.**

ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఓపెనర్లు కేఎల్ రాహుల్(38), యశస్వి జైస్వాల్ శుభారంభం అందించారు. కొత్త బంతితో ఆచితూచి ఆడిన ఈ జోడీ తొలి వికెట్‌కు 58 పరుగులు జోడించింది. వారికన్ బౌలింగ్‌లో స్టెప్ ఔటై ఆడబోయిన రాహుల్.. స్టంపౌట్‌గా వెనుదిరిగాడు. క్రీజులోకి సాయి సుదర్శన్ రాగా మరో వికెట్ పడకుండా యశస్వి జైస్వాల్ తొలి సెషన్‌ను ముగించాడు. దాంతో టీమిండియా 94/1 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్‌లో మరింత సాధికారికంగా బ్యాటింగ్ చేసిన జైస్వాల్, సాయి సుదర్శన్.. బౌండరీలతో వేగంగా పరుగులు రాబట్టారు. ఈ క్రమంలో 82 బంతుల్లో జైస్వాల్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. 87 బంతుల్లో సాయి సుదర్శన్ అర్ధ సెంచరీ సాధించాడు. హాఫ్ సెంచరీ అనంతరం జైస్వాల్ క్లాసిక్ షాట్స్‌తో చెలరేగాడు. ఖారీ పియర్ బౌలింగ్‌లో క్విక్ డబుల్ తీసిన జైస్వాల్ 145 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కెరీర్‌లో యశస్వికి ఇది ఏడో టెస్ట్ సెంచరీ కాగా..తనదైన శైలిలో సంబరాలు చేసుకున్నాడు. సాయి సుదర్శన్ ఇచ్చిన సునాయస క్యాచ్‌ను విండీస్ ఆటగాళ్లు నేలపాలు చేశారు. ఈ అవకాశాన్ని అతను సద్వినియోగం చేసుకున్నాడు. ఈ జోడీని విడదీసేందుకు విండీస్ బౌలర్లు ఎంత ప్రయత్నించినా సాధ్యం కాలేదు. దాంతో భారత్ 220/1 స్కోర్‌తో టీ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్‌లోనూ జైస్వాల్, సాయి సుదర్శన్ తమ జోరును కొనసాగించారు. విండీస్ బౌలర్ల సహనాన్ని పరీక్షిస్తూ వీలు చిక్కిన బంతిని బౌండరీకి తరలించారు. సెంచరీ దిశగా సాగిన సాయి సుదర్శన్‌ను స్టన్నింగ్ డెలివరీతో జోమెల్ వారికన్ వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. రివ్యూ తీసుకున్నా ఫలితం లేకపోయింది. దాంతో రెండో వికెట్‌కు నమోదైన 193 పరుగుల భాగస్వామ్యాని తెరపడింది. క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి యశస్వి జైస్వాల్ తన జోరును కొనసాగించాడు. 224 బంతుల్లో 150 పరుగుల మార్క్ అందుకున్నాడు. మరోవైపు గిల్ తన క్లాస్ బ్యాటింగ్‌తో జైస్వాల్‌కు అండగా నిలిచాడు. దాంతో మూడో సెషన్‌లోనూ విండీస్‌కు ఒక్క వికెట్ దక్కలేదు. దాంతో తొలి రోజు ఆటలో టీమిండియా పూర్తి ఆధిపత్యం చెలాయించింది.

### ఐపీఎల్ వేలానికి

## ముహూర్తం ఫిక్స్

ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) 2026 సీజన్‌కు సంబంధించిన మినీ వేలానికి ముహూర్తం ఖరారైనట్లు తెలుస్తోంది. డిసెంబర్ 13-15 మధ్య వేలం నిర్వహించేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. నవంబర్ 15వ తేదీలోపు 10 జట్లు



తమ రిటెన్షన్ జాబితాను ప్రకటించాల్సి ఉంటుంది. ఐపీఎల్ వేలం జరిగే వేదికతో పాటు తేదీలపై బీసీసీఐ కసరత్తు చేస్తున్నట్లు బోర్డు వర్గాలు పేర్కొన్నాయి. గత రెండు సీజన్లకు సంబంధించిన వేలం విదేశాల్లో జరగ్గా.. ఈసారి స్వదేశంలో నిర్వహించాలనే యోచనలో బోర్డు ఉన్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2025 సీజన్ కోసం మెగా వేలం నిర్వహించగా.. జట్లన్నీ పూర్తిగా మారిపోయాయి. మినీవేలంలో భారీ మార్పులు ఉండకపోయినా.. అవసరం లేని ఆటగాళ్లను ఐపీఎల్ ఫ్రాంచైజీలు వదిలేసే అవకాశం ఉంది. ముఖ్యంగా ఐపీఎల్ 2025 పాయింట్స్ టేబుల్‌లో చివరి రెండు స్థానాల్లో నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ ఎక్కువ సంఖ్యలో తమ ఆటగాళ్లను వదిలేసే అవకాశం ఉంది. తీవ్రంగా నిరాశపర్చిన దీపక్ హుడా, విజయ్ శంకర్, రాహుల్ త్రిపాఠి, సామ్ కరణ్, డెవాన్ కాన్వేలను సీఎస్‌కే వదులుకోనుంది. ఇప్పటికే అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటించడంతో ఆ జట్టు పర్స్‌లో రూ. 9.75 కోట్లు చేరాయి. రాజస్థాన్ రాయల్స్ తమ కెప్టెన్ సంజూ శాంసన్‌తో పాటు వానిందు హసరంగా, మహీష్ తీక్షణలను వదులుకునే ఛాన్స్ ఉంది. కేకేఆర్ రూ.23.75 కోట్లు పెట్టి కొనుగోలు చేసిన వెంకటేశ్ అయ్యర్‌కు గుడ్‌బై చెప్పే ఛాన్స్ ఉంది.

### చాలా సార్లు

## చనిపోవాలనుకున్నా

జీవితంలో ఎదురైన అనూహ్య ఘటనతో చచ్చిపోవాలనుకున్నానని, పలుమార్లు ఆత్మహత్యాయత్నం కూడా చేశానని సౌతాఫ్రికా మహిళా ఓపెనర్ టాజ్మిన్ బ్రిట్స్ తెలిపింది. 2011లో జరిగిన కారు ప్రమాదంతో తన జీవితం ఒక్కసారిగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. భారత్ వేదికగా జరుగుతున్న వన్డే ప్రపంచకప్ 2025లో టాజ్మిన్ బ్రిట్స్ అసాధారణ ప్రదర్శన కనబరుస్తోంది. భారత్‌తో గురువారం జరిగిన మ్యాచ్‌లో టాజ్మిన్ బ్రిట్స్(0) విఫలమైనా.. న్యూజిలాండ్‌పై భారీ శతకం సాధించింది. గత 6 వన్డేల్లో 4 సెంచరీలతో సూపర్ ఫామ్‌లో ఉంది. మహిళల వన్డే క్రికెట్‌లో అత్యంత వేగంగా ఏడు సెంచరీలు చేసిన బ్యాటర్‌గా మెగ్ లానింగ్‌తో సహా పలు రికార్డులను బద్దలుకొట్టింది. అయితే టాజ్మిన్ బ్రిట్స్ క్రికెట్ జర్నీ విభిన్నమైనది. వాస్తవానికి ఆమె అథ్లెటిక్స్ కెరీర్‌ను ఎంచుకుంది. జావెలిన్ త్రోయర్‌గా 2012 లండన్ ఒలింపిక్స్‌కు సిద్ధమైంది. 16 ఏళ్ల వయసులోనే ప్రపంచ అథ్లెటిక్స్ యూత్ ఛాంపియన్‌షిప్స్‌లో బంగారు పతకం సాధించింది. 2010 అథ్లెటిక్స్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం గెలిచి ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది.

## శార్దూల్‌కు కెప్టెన్సీ.. రహానే, సర్ఫరాజ్‌తో ముంబై బృందం

రంజీ ట్రోఫీ 2025-26 కోసం ముంబై సెలెక్టర్లు పటిష్టమైన స్క్వాడ్‌ను ప్రకటించారు. 42 సార్లు ఛాంపియన్ అయిన ముంబైకి ఈసారి శార్దూల్ ఠాకూర్ సారథ్యం వహించనున్నాడు. ఈ మధ్యే అజింక్యా రహానే కెప్టెన్సీ నుంచి వైదొలగడంతో అనుభవజ్ఞుడైన ఠాకూర్‌కు పగ్గాలు అప్పగించారు సెలెక్టర్లు. ముంబై సెలెక్టర్లు శుక్రవారం 16 మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేశారు. ఖాన్ బ్రదర్స్ సర్ఫరాజ్, ముషీర్ ఖాన్‌లకు చోటు లభించింది. ఆసియా కప్‌లో సత్తా చాటిన ఆల్‌రౌండర్ శివం దూబే సైతం స్క్వాడ్‌లో ఉన్నాడు. గత కొంతకాలంగా ముంబైకి ప్రాతినిధ్యం వహిస్తున్న షామ్స్ ములానీ, తనుష్ కొతియాన్, తుషార్ దేశ్‌పాండేలు సైతం ఎంపికయ్యారు.

**ముంబై రంజీ స్క్వాడ్ :**

శార్దూల్ ఠాకూర్(కెప్టెన్), ఆయుశ్ మాత్రే, ఆకాశ్ ఆనంద్ (వైస్ కెప్టెన్), హార్దిక్ తమోర్ (వికెట్ కీపర్), సిద్దేశ్ లాడ్, అజింక్యా రహానే, సర్ఫరాజ్ ఖాన్, శివం దూబే, షామ్స్ ములానీ, తనుష్ కొతియాన్, తుషార్ దేశ్‌పాండే, సిల్వెస్టర్ డిసౌజా, ఇర్ఫాన్ ఉమైర్, ముషీర్ ఖాన్, అఖిల్ హెర్వాడ్కర్, రొయ్‌స్టాన్ డియాస్.

### 93 ఏళ్లలో ఒకేఒక్కడు..

## బుమ్రా

టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా చరిత్ర సృష్టించాడు. 93 ఏళ్ల భారత క్రికెట్ చరిత్రలోనే మూడు ఫార్మాట్లలో 50 మ్యాచ్‌లు ఆడిన ఏకైక ఇండియన్ పేసర్‌గా నిలిచాడు. శుక్రవారం వెస్టిండీస్‌తో ఢిల్లీ వేదికగా ప్రారంభమైన రెండో టెస్ట్‌తో బుమ్రా ఈ ఫీట్ సాధించాడు. బుమ్రాకు ఇది 50వ టెస్ట్ మ్యాచ్. బుమ్రా ఇప్పటి వరకు 75 టీ20లు, 89 వన్డేలు, 50 టెస్ట్‌లు ఆడాడు. ఓవరాల్‌గా ఈ ఘనత సాధించిన ఏడో భారత ఆటగాడిగా బుమ్రా నిలిచాడు. మూడు ఫార్మాట్లలో 50 మ్యాచ్‌లు ఆడిన భారత ఆటగాళ్ల జాబితాలో ధోనీ, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్, కేఎల్ రాహుల్‌లు బుమ్రా కన్నా ముందున్నారు. టెస్ట్‌ల్లో ఏడుగురు భారత పేసర్లు మాత్రమే 50 ప్లస్ టెస్ట్ మ్యాచ్‌లు ఆడారు. ఈ జాబితాలో 131 మ్యాచ్‌లతో కపిల్ దేవ్ అగ్రస్థానంలో ఉండగా.. ఇషాంత్ శర్మ(105), జహీర్ ఖాన్(92), మహమ్మద్ షమీ(64), జవగళ్ శ్రీనాథ్(67), ఉమేశ్ యాదవ్(57) జస్‌ప్రీత్ బుమ్రా కంటే ముందున్నారు.



ఈవార్తలు
ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
శనివారం 11-10-2025 | www.evarthalu.com



## మహిళల కోసం ఈ చట్టాలు

భారత రాజ్యాంగం, వివిధ చట్టాలు పురుషులతో సమానంగా మహిళలకు అనేక హక్కులను కల్పిస్తున్నాయి. ఈ హక్కులు సమాజంలో సమానత్వం, న్యాయం, సాధికారతను ప్రోత్సహించడానికి రూపొందించబడ్డాయి.

1. రాజ్యాంగ హక్కులు: భారత రాజ్యాంగం మహిళలకు పురుషులతో సమాన హక్కులను అందిస్తుంది.
   ఆర్టికల్ 14: చట్టం ముందు సమానత్వం – లింగ ఆధారంగా ఎటువంటి వివక్ష లేకుండా అందరూ సమానం.
   ఆర్టికల్ 15: వివక్ష నిషేధం – లింగం, మతం, కులం, జాతి లేదా జన్మస్థానం ఆధారంగా వివక్ష చేయకూడదు.
   ఆర్టికల్ 16: ఉద్యోగ అవకాశాలలో సమానత్వం – ప్రభుత్వ ఉద్యోగాలలో మహిళలకు సమాన అవకాశాలు.
   ఆర్టికల్ 19: వాక్ స్వాతంత్ర్యం, ఉపాధి, సంఘాలు ఏర్పాటు చేసే హక్కు మహిళలకు కూడా ఉంది.
   ఆర్టికల్ 21: జీవన హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ – మహిళలకు గౌరవంతో జీవించే హక్కు.

2. ఆస్తి హక్కులు:హిందూ సక్సెషన్ యాక్ట్, 1956 (2005 సవరణ): హిందూ కుటుంబంలో మహిళలకు ఆస్తిలో సమాన వాటా హక్కు. కుమార్తెలు, భార్యలు,, తల్లులకు పితృస్వామ్య ఆస్తిలో సమాన హక్కు ఉంది.
   ముస్లిం పర్సనల్ లా: ముస్లిం మహిళలకు ఆస్తి హక్కులు షరియా చట్టం ప్రకారం నిర్ణయించబడతాయి, అయితే రాజ్యాంగం సమాన హక్కులను హామీ ఇస్తుంది.
   క్రిస్టియన్, ఇతర మతాల మహిళలు: ఇండియన్ సక్సెషన్ యాక్ట్, 1925 ప్రకారం ఆస్తి హక్కులు పొందవచ్చు.

3. విద్య, ఉపాధి హక్కులు: విద్య హక్కు : 6–14 సంవత్సరాల మధ్య వయస్సు గల అమ్మాయిలకు ఉచిత, నిర్బంధ విద్య.
   సమాన వేతనం: సమాన పనికి సమాన వేతనం – 1976 చట్టం మహిళలకు హామీ ఇస్తుంది.
   మెటర్నిటీ బెనిఫిట్ యాక్ట్, 1961 (2017 సవరణ): 26 వారాల పాటు చెల్లింపుతో కూడిన ప్రసూతి సెలవు, పని భద్రత, ఇతర ప్రయోజనాలు.
   స్వయం ఉపాధి: మహిళల కోసం ముద్రా యోజన, స్టాండ్–అప్ ఇండియా వంటి పథకాల ద్వారా ఆర్థిక సాధికారత.

4. గృహ హింస నుండి రక్షణ: డొమెస్టిక్ వయొలెన్స్ యాక్ట్, 2005: గృహ హింస నుండి మహిళలకు రక్షణ, న్యాయస్థానం ద్వారా ఆర్థిక, ఆశ్రయ సహాయం.

5. లైంగిక వేధింపుల నుండి రక్షణ: సెక్సువల్ హరాస్‌మెంట్ ఆఫ్ వుమెన్ అట్ వర్క్‌ప్లేస్ (ప్రివెన్షన్, ప్రొహిబిషన్ అండ్ రిడ్రెసల్) యాక్ట్, 2013: పనిస్థలంలో లైంగిక వేధింపుల నుండి మహిళలకు రక్షణ, ఫిర్యాదు పరిష్కార విధానం.

6. వివాహం, విడాకుల హక్కులు:హిందూ మ్యారేజ్ యాక్ట్, 1955: హిందూ మహిళలకు వివాహం, విడాకులు,, జీవనాధారం కోసం హక్కులు.
   ముస్లిం వుమెన్ (ప్రొటెక్షన్ ఆఫ్ రైట్స్ ఆన్ మ్యారేజ్) యాక్ట్, 2019: తలాక్–ఎ–బిద్దత్ (తక్షణ తలాక్) నిషేధం, ముస్లిం మహిళలకు రక్షణ.
   స్పెషల్ మ్యారేజ్ యాక్ట్, 1954: అంతర్జాతీయ, అంతర్మత వివాహాలలో మహిళలకు సమాన హక్కులు.

7. రాజకీయ హక్కులు:సమాన ఓటు హక్కు: మహిళలకు పురుషులతో సమానంగా ఓటు వేసే హక్కు (ఆర్టికల్ 326).
   స్థానిక సంస్థలలో రిజర్వేషన్: పంచాయతీ రాజ్, మున్సిపల్ సంస్థలలో మహిళలకు 33% సీట్ల రిజర్వేషన్ (ఆర్టికల్ 243డీ, 243టీ).

8. ఇతర హక్కులు:డౌరీ నిషేధం (డౌరీ ప్రొహిబిషన్ యాక్ట్, 1961): వరకట్నం ఇవ్వడం లేదా తీసుకోవడం చట్టవిరుద్ధం.
   మహిళల భద్రత కోసం చట్టాలు: పోక్సో యాక్ట్, 2012 (లైంగిక నేరాల నుండి బాలికల రక్షణ), ఇతర చట్టాలు.

### బాలికా, నీవే శక్తి..

ఓ బాలికా, నీవు ఆకాశ తారక,
స్వప్నాల సౌరభం, జీవన రాగం.
నీ చిరునవ్వులో లోకం మునిగెను,
నీ ధైర్యంలో భవిష్యత్తు సాగెను.
అడుగడుగునా నీవు ఎదగాలి,
అడ్డంకులను ధైర్యంతో దాటాలి.
విద్యతో నీవు వెలుగులు నింపాలి,
సమాజానికి ఆదర్శంగా నిలవాలి.
బాలికా, నీవే శక్తి.. నీవే జ్యోతి..
నీ హృదయంలో ప్రేమ,
నీ ఆలోచనలో జ్ఞానం.
ఈ బాలికా దినం నీకై సమర్పణం,
ఎగరాలి నీవు, లోకానికి స్ఫూర్తిగా!

# చిట్టి తల్లి.. చిరునవ్వు!

ఒకప్పుడు ఆడపిల్ల పుడితే ఆనందించేవారు కాదు, మూతి ముడుచుకుని పక్కకి వెళ్లిపోయారు. చూసేందుకు కూడా ఇష్టపడని సమాజం ఉండేది. ఇప్పుడు కాలం మారుతూ వస్తోంది. ఆడపిల్లలు కూడా చదువులో, ఉద్యోగాల్లో రాణిస్తున్నారు. వారు కూడా మగవారితో సమానంగా పనిచే యగలుగుతున్నారు. వారికి కావాల్సిం దల్లా కాసింత మద్దతు. ఆ మద్దతును తొలిగా ఇవ్వాల్సింది తల్లిదండ్రులే. కొడుకుతో సమానంగా కూతురుని చదివించి ఉద్యోగానికి పంపించే తల్లిదండ్రులనే ఇప్పుడు ప్రతి ఆడపిల్ల కోరుకుంటుంది. కానీ ఇప్పటికీ ఆడపిల్లల్ని చదివిస్తున్నా ఉద్యోగానికి పంపకుండా పెళ్లి చేసే తల్లిదండ్రులు ఇంకా ఉన్నారు. ఆడపిల్ల కేవలం పెళ్లి కోసమే పుట్టినట్టు భావించకుండా, వారి కలలకు రెక్కలివ్వాలి. ఆ పనిచేయాల్సింది తల్లిదండ్రులే. ఆడపిల్ల బరువు కాదు, మీ కుటుంబానికి బంగారు భవిష్యత్తు అని గుర్తించాల్సిన అవసరం ఉంది. ప్రపంచవ్యాప్తంగా బాలికలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడం, వారి సాధికారతను ప్రోత్సహించడం కోసం ఏటా అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని అక్టోబర్ 11న నిర్వహిస్తున్నారు. బాలికల విద్య, పోషణ, బాల్య వివాహాలు, చట్టపరమైన హక్కులు, వైద్య హక్కులు వంటి సమస్యలపై అవగాహన పెంచడం లక్ష్యమే ఈ దినం.

ఆడపిల్ల నట్టింట్లో తిరుగుతుంటే ఆ ఇంట్లో మహాలక్ష్మీ ఉన్నట్టే ఉంటుంది. ఆడపిల్ల నవ్వు ఓ పువ్వులా ఇంటికి అందాన్నిస్తుంది. అమ్మాయి అనురాగం పంచుతుంటే.. ఆప్యాయంగా నాన్నా.. అని పిలుస్తుంటే.. అంతకు మించిన ఆనందం ఏముంటుంది? చెల్లిలా, తల్లిలా, స్నేహితురాలిలా.. మనకు జీవితాంతం తోడుంటుంది. చదువులో, ఉద్యోగంలో, ఇంటా బయటా ప్రతిచోటా ఒక ధీరలా, ప్రజ్ఞావనిలా రాణిస్తుంది. ఆకాశంలో సగం తామంటూ.. అన్ని రంగాల్లో సత్తా చాటుతున్న ఆడపిల్లలకు.. ఇప్పటికీ ఆటంకాలూ అవరోధాలూ ఎదురవుతూనే ఉన్నాయి. అన్ని రంగాల్లో మహిళలు సత్తా చాటుతున్నా.. ఇప్పటికీ వివక్షను ఎదుర్కొంటున్నారు. సతీ లాంటి దురాచారాలు లేకున్నా.. బాల్యవివాహాలు, వరకట్న వేధింపులు, అత్యాచారాలు, చదువులో, అవకాశాల కల్పనలో అసమానత్వం అనేవి అడుగడుగునా కనిపిస్తున్నాయి. బాలికల హక్కుల ఉల్లంఘనకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రపంచానికి తెలియజేయడానికి.. 2012 నుంచి ఏటా అక్టోబర్ 11న అంతర్జాతీయ బాలికల దినోత్సవంగా జరుపుకొంటున్నారు. 1995లో బీజింగ్‌లో నిర్వహించిన భేటీలో మహిళలు, బాలికల హక్కుల కోసం ప్రపంచ దేశాలు ఏకగ్రీవ తీర్మానం చేశాయి. బాలికల హక్కుల కోసం ఆమోదం పొందిన తొలి తీర్మానం ఇదే.

ఐక్యరాజ్యసమితి మహిళా విభాగం, యునిసెఫ్‌ల నివేదిక ప్రకారం– ప్రతి అయిదుగురు బాలికల్లో ఒకరు కనీసం పదో తరగతి వరకైనా చదవడం లేదు. పై చదువులకు వెళ్ళిన ప్రతి పదిమంది బాలికల్లో నలుగురు ఇంటర్మీడియట్ పూర్తి చేయలేకపోతున్నారు. అల్పాదాయ దేశాల్లోని యువతుల్లో 90 శాతం అంతర్జాల సేవలను వినియోగించలేకపోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా 5–14 ఏళ్ల వయసు బాలికలు తమ సమాన వయసున్న అబ్బాయిల కంటే ఎక్కువగా కష్టపడుతున్నారు. అయినప్పటికీ, వారికి ఎలాంటి భత్యం లభించడంలేదు. కుటుంబాల్లో పనిభారం ఎక్కువగా అమ్మాయిలపైనే పడుతోంది. ఎంతోమంది బాలికలు సన్నిహితుల నుంచే లైంగిక వేధింపులకు గురవుతున్నారని, కొత్తగా హెచ్ఐవీ సోకుతున్నవారిలో యువతులు పెద్దసంఖ్యలో ఉంటున్నారని ఐక్యరాజ్యసమితి నివేదిక పేర్కొంది. తరచూ ఎదురవుతున్న వేధింపుల కారణంగా బాలికలు చదువులకు దూరమవుతున్నారు. ఇంటికి దూరంగా ఉన్న పాఠశాలలకు వెళ్ళి వచ్చేటప్పుడు, బడుల్లోనూ వారు హింసకు గురవుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇటువంటి బాధితుల సంఖ్య ఆరు కోట్ల వరకు ఉంటుందని తాజా సర్వేలో తేలింది. వేధింపుల వల్ల అమ్మాయిల మానసిక స్థితి తీవ్ర ప్రభావానికి లోనవుతుంది. పర్యవసానంగా వారి ఆరోగ్యం, అభివృద్ధి కుంటుపడతాయి. వేధింపులు తాళలేక ఏటా అర్ధాంతరంగా చదువు ముగిస్తున్న బాలికల సంఖ్య 24.6 కోట్ల వరకు ఉంటుందని ఓ అధ్యయనంలో యునిసెఫ్ విశ్లేషించింది. భారతదేశంలో బాలికల జనాభా సుమారు 25.30 కోట్లు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే–5 ప్రకారం, ప్రతి వెయ్యిమంది అబ్బాయిలకు 929 మంది బాలికలే ఉన్నారు. పైగా, మగపిల్లలకంటే ఆడపిల్లలే ఎక్కువగా చనిపోతున్నది మన దేశంలోనే కావడం దురదృష్టకరం. 20–24 ఏళ్ల వయసు మహిళల్లో 23.3శాతం 18 ఏళ్లు నిండకముందే వివాహం చేసుకున్నారు. బాల్య వివాహాలను నిర్మూలించడంతో పాటు వారు జీవితంలో నిలదొక్కుకొనేందుకు వీలుగా మహిళల కనీస వివాహ వయసును 18 ఏళ్ల నుంచి 21 సంవత్సరాలకు పెంచుతూ కేంద్రం బాల్యవివాహాల నిషేధ(సవరణ) బిల్లును తీసుకొచ్చింది. నిరుడు జనవరి నాటికి దేశంలో మొత్తం 2,26,728 పోక్సో కేసులు పెండింగులో ఉన్నాయి. జాతీయ నేర గణాంక సంస్థ నివేదిక ప్రకారం– 2021 చివరి నాటికి తెలంగాణలో బాలలపై లైంగిక వేధింపులకు సంబంధించి మొత్తం 4,332 కేసుల్లో దర్యాప్తు పూర్తయింది. 40.3శాతం కేసులు ఇంకా అపరిష్కృతంగానే ఉన్నాయి. జాతీయ సగటు (36.8శాతం) కంటే ఇది ఎక్కువ! తెలంగాణలో రోజూ సగటున ఏడుగురు మైనర్లపై లైంగిక వేధింపులు చోటుచేసుకుంటున్నట్లు విశ్లేషణలు వచ్చాయి. బాలికల జీవితాల్లో మార్పు తీసుకురావాలంటే, మొదట వారికి తల్లిదండ్రుల సంపూర్ణ మద్దతు ఎంతో అవసరం. జీవన నైపుణ్యాలపై వారికి తర్ఫీదు ఇవ్వాలి. బాలికలపై వేధింపులను నివారించేందుకు మరిన్ని కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు తమ హక్కుల పట్ల వారికి అవగాహన పెంపొందించాలి. కీలక రంగాల్లో వారి భాగస్వామ్యాన్ని పెంచడమే కాకుండా, వారు రాణించేందుకు అవసరమైన వనరులను సమకూర్చాలి. అత్యాచార బాధితుల కోసం ప్రత్యేకంగా పునరావాస ఏర్పాట్లుచేసి, వారి సంపూర్ణ ఆరోగ్యానికి పెద్దపీట వేయాలి. భద్రత, భరోసా దక్కినప్పుడే– బాలికల జీవితాల్లో ఆనందం విరబూస్తుంది. చాలామంది తల్లిదండ్రులు ఆడపిల్లలను చులకనగా చూస్తుంటారు. అబ్బాయిల ముందు వారిని తక్కువచేసి మాట్లాడటం, డబ్బులు ఖర్చుచేసే విషయంలో వ్యత్యాసం చూపడం చేస్తుంటారు. ఇటువంటి దుర్విచక్షణను కుటుంబ స్థాయిలోనే అరికట్టాలి. తల్లిదండ్రులు అమ్మాయిలు చెప్పేది వినడం, వారి ప్రశ్నలకు సమాధానమివ్వడం, నిర్ణయాలు తీసుకునే విషయంలో వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం ఎంతో అవసరం. నాయకత్వ లక్షణాలను పెంపొందించడం ద్వారా వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయవచ్చు. ఆడ పిల్లలకు ఉన్నత చదువులు చెప్పించినా, కట్నం ఇవ్వనిదే వివాహం కావడంలేదు. వరకట్న నిషేధం, రక్షణకు సంబంధించి అనేక చట్టాలు ఉన్నప్పటికీ, అవేవీ సరిగ్గా అమలు కావడంలేదు. వీటిని చిత్తశుద్ధితో అమలు చేసినప్పుడే పరిస్థితుల్లో మార్పు వస్తుంది.





- అలేఖ్య కట్కం

OWNED, PUBLISHED BY BOMMAKANTI SHRAVAN KUMAR, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: BOMMAKANTI SHRAVAN KUMAR, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.